ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 11 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

11-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	27
తెనాలి	36	27
నరసరావుపేట	33	26
బాపట్ల	36	26
రెంటచింతల	34	26
చీరాల	36	27

ఎస్జీటీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

- రాత్రి వరకు పరిష్కారం కాని సాంకేతిక సమస్యలు
- మాన్యువల్‌గా నిర్వహణకు యత్నించినా పలు సమస్యలు
- రాత్రి వరకు ఉపాధ్యాయులు పడిగాపులు
- మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్ వాయిదా



గుంటూరు(విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గందరగోళం.. ఆందోళనలు.. సాంకేతిక సమస్యలు.. వాయిదాల మధ్య సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సా..గుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌ను జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం చేపట్టేందుకు అధికారులు శతవిధాలా ప్రయత్నించారు. అయితే రాత్రి 9 గంటల వరకు కూడా సాంకేతిక సమస్యలు ఒక కొలిక్కి రాకపోవడంతో చివరకు బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహణకు మంగళవారం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒకటి నుంచి 350 వరకు సీరియల్ నెంబర్‌లోని ఎస్జీటీ తెలుగు ఉపాధ్యాయులు మధ్యాహ్నం రెండు గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఖాళీల జాబితా సిద్ధం కాకపోవడంతో రాత్రి 9 గంటల వరకు బదిలీల ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతోపాటు అనేక సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో కౌన్సెలింగ్‌ను బుధవారానికి వాయిదా వేసినట్లు డీఈఓ రేణుక ప్రకటించారు. దీంతో రాత్రి వరకు ఉపాధ్యాయులు జడ్పీ వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. చివరకు కౌన్సెలింగ్ వాయిదాతో ఉపాధ్యాయులు వెనుతిరిగారు. బుధవారం జరగాల్సిన కార్పొరేషన్, మున్సిపల్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌ను కూడా వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

నేటి కౌన్సెలింగ్ వివరాలు..

మండల పరిషత్ పాఠశాలల్లోని ఎస్జీటీ(తెలుగు) ఉపాధ్యాయులకు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సీరియల్ నెంబరు 1 నుంచి 750 లోపు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ జరగనున్నది.

వ్యవసాయ శాఖలో బదిలీల జాతర

- గుంటూరు డీఏఓ నంద్యాలకు బదిలీ
- పల్నాడు జిల్లాకు కొత్త వ్యవసాయ అధికారి
- పలువురు ఏడీఏ, ఏఓలకు స్థానచలనం
- 'ఆంధ్రజ్యోతి' కథనాలతో మారిన జాబితా ముఖ చిత్రం

6

ఇంటీరియర్ పనులు త్వరగా పూర్తిచేయాలి

- గుత్తేదారు సంస్థకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాలు

8



వేటకు వెళ్ళేందుకు వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

వేటకు.. వేళాయే

- విరామం ముగింపుతో 15 నుంచి ప్రారంభం
- వలలు, బోట్లకు మరమ్మతుల్లో మత్స్యకారులు

రేపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేటకు విరామం మరో మూడు రోజులే. ఆదివారం నుంచి సముద్రంలో వేటకు మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. వలలకు, బోట్లకు మరమ్మతులు నిర్వహించుకుంటున్నారు. వైర్‌లెస్ పరికరాలకు మరమ్మతులు చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉందని, మత్స్యకారులు వేటకు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. మత్స్యసంపద ఎక్కువ వచ్చే అవకాశం ఉందని ఆశల్లో ఉన్నారు. పెద్దబోటులో 20మందికిపైగా మత్స్యకారులు వేటకు వెళ్తారు. వారం రోజులు సముద్రంలో వేట చేసుకుని మత్స్య సంపదతో తీరానికి చేరుకుంటారు. ఫైబర్‌బోటులో అయితే ఐదుగురు, మూడు రోజులు వేట చేస్తారు. నిజాంపట్నం హార్బర్ పరిధిలో 400 వరకు పెద్దబోట్లు, 300 ఫైబర్‌బోట్లు ఉన్నాయి. వేటపై ఆధారపడి 2 వేల కుటుంబాలు ఉండగా వారంతా వేటకు సిద్ధమవుతున్నారు. వేట విరామంలో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది.

నాటు సారా నిర్మూలనకు కమిటీలు

- కలెక్టర్ జె.వెంకటమురళి
- నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాలపై సమీక్ష

బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మద్యం అక్రమ విక్రయాలు, నాటుసారా నిర్మూలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె. వెంకటమురళి ఆదేశించారు. నాటుసారా నిర్మూలనపై నవోదయం 2.0 అవగాహన కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా తయారీని అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టాలని చెప్పారు. మద్యం అక్రమ విక్రయాలు జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. గోవా నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యంను అరికట్టాలని సూచించారు. చాక్లెట్‌లు, ద్రవపదార్థాల రూపంలో గంజాయి విక్రయాలు జరిగితే సహించేదిలేదన్నారు. చీరాల మండలంలో 9 గ్రామాలు, బాపట్ల మండలంలో రెండు గ్రామాలు, రేపల్లె మండలంలో ఒక గ్రామంలో నాటుసారా ఉత్పత్తులు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. 17 గ్రామాల్లో 65 కుటుంబాలు రహస్యంగా నాటుసారా ఉత్పత్తి చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటికే గడిచిన నాలుగు నెలల్లో 43 కేసులు నమోదు అయ్యాయని 29 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. ఆ కుటుంబాలను వృత్తి నుంచి మాన్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటుసారా ఉత్పత్తులను బాపట్లలో పూర్తిగా అరికట్టడానికి మండల, గ్రామస్థాయిలో కమిటీలు నియమించాలని ఆదేశించారు. ఈ కమిటీలు అత్యంత చురుగ్గా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బందిని కమిటీలో చేర్చాలన్నారు. కళాజాత బృందాలతో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ హేమంత నాగరాజు, ప్రొహిబిషన్ పర్యవేక్షణాధికారి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీరు @ 24/7

- గుంటూరు సహా నాలుగు పట్టణాల్లో
- పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో పనులు
- రానున్న ఏడాదిలో పథకం ప్రారంభానికి చర్యలు

ఇక పుష్కలంగా నీటి సరఫరా

ఈ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా..


తొలుత కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా 24/7 నీటి సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. గుంటూరులో వికాస్‌నగర్, తెనాలిలో బస్టాండ్ ఏరియా, నరసరావుపేటలో ప్రకాశ్‌నగర్, చిలకలూరిపేటలో పండరీపురం ప్రాంతాలను ఎంపిక చేశారు. ఆ ప్రాంతాల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్లతో పాటు డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లను నిర్మించనున్నారు. ఆయా పనులకు టెండర్లు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత 24/7 నీటి సరఫరా చేయనున్నారు.

తాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియక రోజంతా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండదు. ఒకవేళ ఎక్కడికైనా వెళ్తే ఆ రోజుకు తాగునీరు పట్టుకోలేమోనని ఆందోళన అవసరం లేదు. వారంలో ఏడు రోజులు.. 24 గంటలు పుష్కలంగా తాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయమా.. మధ్యాహ్నమా.. సాయంత్రమా.. లేక రాత్రి అన్న తేడా లేకుండా రోజులో ఎప్పుడైనా కుళాయి తిప్పితే తాగు నీరు అందేలా సరఫరాకు చర్యలు చేపట్టింది. గుంటూరు కార్పొరేషన్‌తో పాటు తెనాలి, నరసరావు పేట, చిలకలూరిపేట పట్టణాల్లో 24 గంటల నీటి సరఫరా పథకాన్ని అమలు చేయనున్నారు. పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు. నీటి సరఫరాకు అవస రమైన పనులను గుర్తించారు. ఆయా పనులకు టెండర్ ప్రక్రియ చేపట్టారు. రానున్న ఏడాదిలో ఈ పథకం ప్రారంభించనున్నారు.



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎంపిక చేసిన మున్సిపల్ పట్టణాల్లో 24 గంటలు తాగునీటి సరఫరాతో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తీరిపోనున్నాయి. ఇందుకు మున్సిపాల్టీలు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. 24/7 నీటి సరఫరాకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్, తెనాలి, నరసరావుపేట, చిలకలూరిపేట మున్సిపల్ పట్టణాలను ఎంపిక చేశారు. ఈ పట్టణాల్లో 24/7 నీటి (మిగతా 8వ పేజీలో)



నీటి సరఫరాకు ఎంపిక చేసిన నరసరావుపేటలోని ప్రకాశ్‌నగర్



కాకానిపాలెంలో ఆరోగ్య కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళి

విద్యా, వైద్యానికి ప్రాధాన్యం

- అద్దంకిలో డయాలసిస్, హెచ్ఐవీ కేంద్రాలకు కృషి
- పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి రవికుమార్

అద్దంకి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యంతో పాటు రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి, ఏడాదిలోనే మార్పు తీసుకొచ్చామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి రేణింగవరంరోడ్డులో రూ.1.46 కోట్లతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం మంత్రి కలెక్టర్ వెంకటమురళితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అద్దంకిలో డయాలసిస్ సెంటర్ అందుబాటులో లేక గుంటూరు, ఒంగోలు వెళ్లేందుకు రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ కేంద్రాన్ని, హెచ్ఐవీ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. నెల రోజుల్లో నియోజకవర్గంలో 4 ప్రభుత్వ వైద్యశాలలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో విజయమ్మ, ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, తహసీల్దారు శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర పాల్గొన్నారు.



కలెక్టర్, డీఎంహెచ్‌వోలతో చర్చిస్తున్న మంత్రి రవికుమార్

ప్రభుత్వ భూమిని గుర్తించండి

అద్దంకికి రెండు సబ్‌స్టేషన్లు, అగ్నిమాపక కేంద్ర మంజూరైతే ప్రభుత్వ భూమి లేక వాటి ఏర్పాటుకు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని మంత్రి తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశం చారు. భవిష్యత్తు అవసరాల కోసం ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయ నున్నట్లు కలెక్టర్ తెలిపారు. రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు మినీ బైపాస్ రోడ్డు ఏర్పాటుకు కాల్వ కట్టపై ఉన్న ఆక్రమణలను జూలై చివరికల్లా తొలగించాలన్నారు. శింగరకొండ నుంచి రేణింగవరం రోడ్డు వరకు కూడా రెండో విడతలో మినీ బైపాస్ పొడిగిస్తామన్నారు.

డీఎస్‌వోగా జమీర్‌బాషా

జిల్లాలో అధికారుల బదిలీలు



బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారుల బదిలీలు పెద్దఎత్తున జరిగాయి. బాపట్ల జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి డీఎస్‌వోగా ఉన్న ఈబీ విలియమ్స్‌ను ఏలూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న షేక్.జమీర్‌బాషాను నియమించారు. మంగళవారం విలియమ్స్ రిలీవ్‌కాగా జమీర్‌బాషా బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

- మైనింగ్ ఏడీ పి.రాజేష్‌కుమార్‌ను రాయచోటికి బదిలీ చేశారు.
- జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ స్థానంలో కడప డీడీఏ ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావును నియమించారు. జూలైలో రామకృష్ణ ఉద్యోగ విరమణ అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరరావు బాధ్యతలు తీసుకోనున్నారు.

తీరాన్ని కబళిస్తున్నారు

కట్టలు చదును.. ఆపై ఆక్రమణ • ప్రమాదంలో తీర ప్రాంత గ్రామాల రక్షణ

తాజాగా చదును చేసి పార్కింగ్‌కు కేటాయించిన ఓ రిసార్ట్ నిర్వాహకులు



తీరం వరకు నేలను రోడ్డుకు మూడు అడుగుల తక్కువలో చదును చేసి వేడుకలకు సిద్ధం చేసిన ఓ రిసార్ట్ నిర్వాహకులు



చీరాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చీరాల పరిసర ప్రాంతాల్లోని తీరం ఆక్రమణలతో కనుమరుగైపోతోంది. వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం వరకు తీరాన్ని కబ్జా చేసేస్తున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. అక్రమార్కులు బరి తెగిస్తూ రిసార్ట్స్ నిర్మిస్తున్నారు. కట్టలను తొలగించి టేబుల్స్ వేస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఇటీవల ఓ రిసార్ట్ నిర్వాహకుడు ఎదురుగా ఉన్న తీరం కట్టను తొలగించి పార్కింగ్‌గా మార్చుకున్నాడు. గ్రామాలకు రక్షణగా తీరంలో సహజ సిద్ధంగా ఏర్పడిన 10 అడుగుల ఎత్తైన కట్టలు సైతం కబళిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో తీరం వెంబడి ఉన్న కట్టలు సునామీ ఉధృతిని నిలువ రించాయి. అలాంటి కట్టలు కనుమరగవుతుండటంతో మత్స్యకార గ్రామీణులు భయాందోళనలు చెందుతున్నారు. తీరంలో రిసార్ట్స్ నిర్మాణంతో ఎంతో అభివృద్ధి సాధిస్తోంది. నిరుద్యోగులకు ఉపాధితో పాటు, పర్యాటక రంగం వృద్ధి చెందుతుంది. అయితే వ్యాపారులు వారి స్వలాభం కోసం తొక్కుతున్న అడ్డదారులతో ప్రజారక్షణ ప్రమాదంలో పడింది.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే కూల్చేస్తాం..



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిసార్ట్స్ నిర్మిస్తే కూల్చివేస్తాం. తీరానికి సంబంధించిన కట్టలు చదును చేస్తున్నట్లు సమాచారం ఉంది. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

\- చంద్రశేఖర్‌నాయుడు, ఆర్డీవో చీరాల

జీడీసీసీబీ భోక్తలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార(జీడీసీసీ) బ్యాంకులో జరిగిన భారీ కుంభకోణానికి సంబంధించి భోక్తలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగుల సంఘ నేతలు డిమాండ్ చేశారు. సత్యమేవ జయతే పేరుతో మంగళవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల నేతలతో పాటు ఉద్యోగుల సంఘ నేతలు ప్రసంగించారు. రెవెన్యూ రికార్డు, ఆధార్, పాన్ కార్డులు సృష్టించి డీసీసీబీలో అక్రమంగా రుణాలు పొందిన వారి నుంచి సదరు మొత్తాన్ని వసూలు చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహకార శాఖ ద్వారా చేపట్టిన సెక్షన్ 51 విచారణ కొందరిని సంతృప్తి పరిచేలా, అసలైన నిందితులను కాపాడేందుకు జరిగినట్లుగా ఉందని అనుమానాలు వ్యక్తం చేశారు. అక్రమాల్లో కీలక భూమిక పోషిస్తున్న అధికారులకు కొందరు పెద్దల సహకారం ఉన్నట్లుగా భావించాల్సి వస్తుందని తెలిపారు. స్కాంతో సంబంధంలేని ఉద్యోగులపై చర్యలు నిలుపుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

సత్యమేవ జయతే అంటూ సహకార ఉద్యోగుల దీక్ష

ఈ కార్యక్రమంలో సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొప్పలపూడి శ్రీనివాసరావు, అఖిల భారత కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ నేతలు కె.వి.ఎస్.రవికుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నారాయణరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఎం.హనుమంతరావు, అరుణ్‌కుమార్, అంజిబాబు, జాతీయ కార్యదర్శి గని, కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు రెడ్డి, పవన్, శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్(టీడీపీ), మస్తాన్‌వలి(కాంగ్రెస్), సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు కొరివి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, రచయిత దేవరకొండ శ్రీనివాస్, కళాకారులు అభ్యుదయ గేయాలు ఆలపించారు.



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టిన కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగులు

జగన్ ప్రభుత్వంలో మీడియాపై ఆంక్షలు, దాడులు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



పొన్నూరుటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో మీడియాపై ఆంక్షలు, జర్నలిస్టులపై దాడులకు లెక్కేలేకుండా జరిగాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంగళవారం పేర్కొన్నారు. పత్రికలు, మీడియాపై ఉక్కుపాదం మోపేందుకు నాడు వైఎస్ఆర్ జీఓ నంబరు 930 తీసుకువస్తే తండ్రి వారసత్వంగా జగన్ రెడ్డి 2430 జీవోను విడుదల చేశారని గుర్తు చేశారు. ఏబీఎన్, టీవీ 5, ఈ టీవీ లాంటి అత్యంత ప్రజాదరణ కలిగిన ఎలక్ట్రానిక్ మీడియాపై జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడి పదుల సంఖ్యలో అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చానళ్ల ప్రసారాలను ఆపాలని కేబుల్ ఆపరేటర్‌లకు వైసీపీ పాలకులు అనధికారికంగా హుకుం జారీ చేశారని దుయ్యబట్టారు. టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ దారపనేని నరేంద్రను అర్ధరాత్రి అరెస్టు చేసి, వేధించారని గుర్తుచేశారు. సీనియర్ జర్నలిస్టు అంకబాబు, కోగంటి శ్రీనుబాబు, పరుచూరి రమ్య, దాసరి కోటి లాంటి వారిని అరెస్టు చేసి కస్టోడియల్ టార్చర్ చేశారని ఆరోపించారు. ఆంధ్రజ్యోతి విలేకరి కాటా సత్యనారాయణ హత్యకు గురైన విషయం ప్రజానీకం మరువలేదన్నారు. అమరావతిలో పోలీసులను ఫొటోలు తీశారని ముగ్గురు విలేకర్ల పై అక్రమ కేసులు బనాయించిన విషయం వైసీపీ పాలకులు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు ఏబీఎన్, టీవీ 5, జర్నలిస్టు ల పై దాడికి పాల్పడి కార్లు, కెమెరాలు ధ్వంసం చేశారని గుర్తు చేశారు. అసెంబ్లీ పాసులు ఇవ్వకుండా నాటి వైసీపీ పాలకులు జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులపై జరిగిన దాడులు, హత్యలపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు.

అమరావతిపై విష ప్రచారం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

నరసరావుపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సాక్షి చానల్ యాజమాన్యం ఆలోచనల మేరకు అమరావతిపై కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు కావాలని మాట్లాడారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చోళులు, రెడ్డిరాజులు, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు, సిద్ధార్థుడు నడయాడిన ప్రాంతాన్ని వేశ్యల రాజధాని అని మాట్లాడం ఆడపడుచులందరిని అవమానించి నట్లేనని భావిస్తున్నామన్నారు. దీనికి కారకులైన చానల్ యాజమాన్యం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందులో మీనమేషాలు లెక్కపెడితే ప్రజల ఆగ్రహావేశాలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాటల్లో ఎక్కడ చూసినా రేచ్చగొట్టే ధోరణే కనపడుతుందన్నారు. సంకర జాతి అంటున్నారని, ఇది వినడానికే ఇబ్బందిగా ఉందన్నారు. రాజధానిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్ ముందుకొచ్చాయని, ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకొని ఆడపడుచులకు న్యాయం చేసి ఆత్మగౌరవం కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సాక్షి చానల్‌లో రాజధాని మహిళలనే కాదు యావత్ జాతినే కించపరిచారన్నారు. సమావేశంలో కొక్కిరాల శ్రీనినివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతనిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో బదిలీల జాతర

గుంటూరు డీఏఓ నంద్యాలకు బదిలీ

పల్నాడు జిల్లాకు కొత్త వ్యవసాయ అధికారి

పలువురు ఏడీఏ, ఏఓలకు స్థానచలనం

'ఆంధ్రజ్యోతి' కథనాలతో మారిన జాబితా ముఖ చిత్రం

గుంటూరు సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగ ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. కూటమి ప్రభుత్వంలో మొట్టమొదటిసారి జరిగిన బదిలీ ప్రక్రియలో వ్యవసాయ శాఖలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల వ్యవసాయ అధికారులకూ స్థానచలనం తప్పలేదు. లెక్కకు మించిన సంఖ్యలో ఏడీఏలు, ఏఓలు బదిలీ అయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో కీలకమైన స్థానాల్లో తిష్టవేసిన కింద స్థాయి అధికారులు పలువురు బదిలీ అయ్యారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేల లేఖలను సైతం పక్కన పెట్టారన్న ఆరోపణలు వచ్చాయి. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యేలు చెప్పిన చోట పలువురికి పోస్టింగ్ ఇచ్చారు.

'నున్న'కు కీలక స్థానం



నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లును నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా నియమించారు. ఆయన నియామకం కోసం మంత్రులు, ఐఏఎస్‌లు సిఫార్సు చేసినట్లు తెలిసింది. కమిషనరేట్‌లో ఉన్న ఎం.జగ్గారావును పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారిగా నియమించారు. కడప జిల్లా వ్యవసాయ అధికారి ఎ. నాగేశ్వరావును గుంటూరు డీఏఓగా నియమించారు. ప్రస్తుతం గుంటూరు డీఏఓ నరసింహారావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ విరమణ తర్వాత నాగేశ్వరావు డీఏఓగా బాధ్యతలు చేపడతారు.

మండల వ్యవసాయ అధికారులు..

బాపట్ల ఏఓ యాకోబును నరసరావుపేటకు, మంగళగిరి ఏఓ శ్రీనివాసులును గుంటూరుకు, చీరాల ఏఓ సుమతిని బాపట్లకు, కొరిశపాడు ఏఓ శ్రీనివాసరావును బల్లికురవకు, ఏఓ ఎం.సరితను వేటపాలేనికి, ఏఓ లావణ్యను మార్టూరుకు, ఏఓ కుమారిని యద్దన పూడికి, ఏఓ లక్ష్మిని మేడికొండూరుకు, ఏఓ శ్రీదేవిని పల్నాడు జిల్లా కార్యాలయానికి, ఏఓ సరితను చిలక లూరిపేటకు, ఏఓ సుభాషిణిని గుంటూరుకు, ఏఓ విజయబాబును దుగ్గిరాలకు, ఏఓ ఇల్సా సువిధను బాపట్ల జిల్లా కార్యాలయానికి, ఏఓ శ్రీరంజనిని కాకుమానుకు, ఏఓ లక్ష్మారెడ్డిని రెంటచింతలకు, ఏఓ పుల్లారెడ్డిని కొల్లూరుకు, ఏఓ బ్రహ్మారెడ్డిని భట్టిప్రో లుకు, ఏఓ శాంతిని నరసరావుపేటకు, ఏఓ సత్యవాణిని తాడేపల్లికి, ఏఓ కృష్ణ వేణిని బాపట్లకు, ఏఓ లోకేశ్వరిని బాపట్లకు, ఏఓ కల్పనను గుంటూరు కు, ఏఓ సుధారాణిని గుంటూరుకు, ఏఓ కిరణ్మయిని చీరాలకు, ఏఓ శిరీషను మంగళగిరికి, ఏఓ కృష్ణయ్య ను పెదకూరపాడుకు, ఏఓ హరిప్రసాద్‌ను యడ్లపాడుకు, ఏఓ సంధ్యారాణిని పిడుగురాళ్లకు, ఏఓ అరుణను పల్నాడుకు, ఏఓ శ్రీధర్ రెడ్డిని ముప్పాళ్లకు, ఏఓ మల్లికార్జునరావును గుంటూరుకు, ఏఓ సరళను బాపట్లకు, ఏఓ సుబ్రహ్మణ్యంను పెదనందిపాడుకు, ఏఓ హేమంత్ భరత్ కుమార్‌ను అమృతలూరుకు, ఏఓ బి. కిషోర్‌ను గుంటూరు రూరల్‌కు, ఏఓ శివ లలితను రొంపిచర్లకు, ఏఓ శోభరాణిని గుంటూరుకు, ఏఓ మోహన్‌రెడ్డిని బాపట్లకు, ఏఓ వెంకట్రావును పల్నాడు డీఏఓ కార్యాలయానికి, ఏఓ అలేఖ్య జాన్‌ను గుంటూరు కమిషనరేట్‌కు, ఏఓ సుజాతను గుంటూ రు జేడీ కార్యాలయానికి, ఏఓ ప్రియదర్శినిని చేబ్రోలు కు, ఏఓ మీరమ్మను ఇంకొల్లుకు, ఏఓ వెంకటేశ్వరా వును పొన్నూరుకు, ఏఓ బాలాజీ గంగాధర్‌ను వెల్దుర్తికి, ఏఓ రాంమోహన్ రెడ్డిని కొరిశపాడుకు, ఏఓ పద్మాంజలిని బాపట్లకు, ఏఓ రామమ్మను మాచవరానికి, ఏఓ నాగరాజును కారంచేడుకు, ఏఓ అరుణ కుమారిని బెల్లంకొండకు, ఏఓ ప్రేమ్‌సాగర్‌ను వేమూరుకు, ఏఓ శ్రీనివాసరెడ్డిని కొల్లిపరకు, ఏఓ భాస్కర రావును పర్చూరుకు, ఏఓ సునీతను వట్టిచెరుకూరుకు, ఏఓ వెంకటేష్‌ను దాచేప ల్లికి, ఏఓ నరసింహారావును కారంపూడికి, ఏఓ వెంకటరామయ్యను బాపట్లకు, ఏఓ పాపకుమారిని మాచర్లకు, ఏఓ స్రవంతిని గుంటూరుకు, ఏఓ సంధ్యారాణిని తుళ్లూరుకు, ఏఓ నరేంద్రబాబును గురజాలకు, ఏఓ శ్రీనివాస్ నాయక్ ను తాటికొండకు, ఏఓ వరలక్ష్మిని వినుకొండకు, ఏఓ విజయరాజును నిజాంపట్నంకు, ఏఓ చంద్రశేఖర్‌ను చినగంజాంకు, ఏఓ సుధీర్ బాబును తెనాలికి, ఏఓ శారదను బాపట్లకి, ఏఓ సుగుణ బేగంను ప్రత్తిపాడుకు, ఏఓ సుదీర్‌ను బాపట్లకు, ఏఓ ఫరూక్‌ను చెరుకుపల్లికి, ఏఓ ఆంజనేయులు నాయక్‌ను నూజెండ్లకు, ఏఓ సైతాను సంతమాగులూరుకు, ఏఓ మహేష్‌బాబును రేపల్లెకు, ఏఓ ఖడ్గం రమణకుమార్ ను పెదకాకానికి, ఏఓ సుబ్బారెడ్డిని సత్తెనపల్లికి, ఏఓ కోట య్యను నరసరావుపేటకు, ఏఓ మాధవిని గుంటూ రు కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఏడీఏల బదిలీలు ఇలా..

వైసీపీ అనుకూల ఏడీఏలు గుంటూరు సమీప ప్రాంతాల్లో పాగా వేసేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. గుంటూరు ఏడీఏ పోస్టు వ్యవహారంలో తీవ్ర పోటీ ఏర్పడింది. పర్చూరులో పనిచేస్తున్న ఎన్.మోహన్‌రావును గుంటూరు ఏడీఏగా నియమించారు. బాపట్ల జిల్లా అద్దంకి ఏ డీఏ ధనరాజును బాపట్లకు, గుంటూరు ఏడీఏ అన్నపూర్ణమ్మను బాపట్ల డీఏఓ కార్యాలయానికి బదిలీ చేశారు. మంగళగిరి ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డిని బాపట్లకు, పల్నాడు జిల్లా క్రోసూరు ఏడీఏ హనుమంతురావును బాపట్లకు, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మను సత్తెనపల్లికి, సత్తెనపల్లి ఏడీఏ అమలకుమారిని పల్నాడు జిల్లా కార్యాలయానికి, వినుకొండ ఏడీఏ రవి బాబును పల్నాడు డీఏఓ కార్యాలయానికి, బాపట్ల ఏడీఏ లక్ష్మిని రేపల్లెకు, బాపట్లకు చెందిన మరో ఏడీఏ రత్నకుమారిని చీరాలకు, పల్నాడు జిల్లా కేంద్రంలో ఉన్న ఏడీఏ రవి కుమార్‌ను వినుకొండకు, ఏడీఏ శివకుమారిని గుంటూరుకు, బాపట్లలో పనిచేస్తున్న కెవీ శ్రీనివాసరావును పల్నాడు జిల్లా నరసరావుపేట ఏడీఏగా నియమించారు. గుంటూరు ఏడీఏ తోట కూర శ్రీనివాసరావు ను మంగళగిరికి బదిలీ చేశారు.

సామాజిక స్పృహతో పొగాకు కొనుగోలు చేయండి

● కంపెనీల యజమానులకు రైతు నాయకుల విజ్ఞప్తి



పొగాకు కొనుగోలు కంపెనీల యజమానులుతో చర్చలు జరుపుతున్నరైతు సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహతో పొగాకును కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పొగాకు కొనుగోలు కంపెనీల యజమానులకు రైతు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గుంటూరులోని ఓ హోటల్లో కంపెనీల యజమానులతో రైతు సంఘాల నాయకులు చర్చలు జరిపారు. పొగాకు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్నారని కంపెనీ యజమానుల దృష్టికి తీసుకువచ్చారు. వారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ ఈ నెల 5న జీపీఐ కంపెనీ ఎదుట జరిగిన ఆందోళనలతో కొనుగోళ్లు ముందుకు సాగాయని అన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌తో కొనుగోళ్లు ప్రారంభించిందని, ఈ సమయంలో మిగిలిన కంపెనీలు ముందుకు వస్తే సమస్య పరిష్కారమవుతుందని వివరించారు. తమ టార్గెట్‌కు మించి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తామని కంపెనీల యజమానులు ఈ మేరకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. చర్చల్లో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఐటీసీ జనరల్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి, ఎలైన్స్ కేర్ అధినేత చేబ్రోలు రవీంద్ర, పోలిశెట్టి ఇండస్ట్రీస్ అధినేత పోలిశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.

'హృదయ' విదారకం..

● ఆగిన తండ్రి గుండె.. ● గంటల వ్యవధిలో కుమార్తె ఆత్మహత్య



చీమకుర్తి సుబ్రహ్మణ్యం



లక్ష్మీశ్రావణి

తెనాలి, మారీసుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో 'హృదయ' విదారక ఘటన చోటు చేసుకుంది. తండ్రి గుండె ఆగిందని తెలుసుకుని కుంగిపోయిన కుమార్తె గంటల వ్యవధిలో అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఒకే రోజులో వెనువెంటనే తండ్రి, కుమార్తె మరణించడంతో.. ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోతే.. ఈ విషాదం స్థానికులను సైతం కంటతడి పెట్టింది. తెనాలి టూటౌన్ పోలీసులు వివరాల మేరకు.. గంగానమ్మ పేటకు చెందిన పసువుల దాణా వ్యాపారి చీమకుర్తి సుబ్రహ్మణ్యం, హేమలత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఏడాది క్రితం పెద్ద కుమార్తె లక్ష్మీశ్రావణికి(23) విజయవాడకు చెందిన చినరాజాతో వివాహం చేశారు. కొంత కాలానికే దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో పుట్టింట్లోనే లక్ష్మీశ్రావణి ఉంటోంది. తండ్రి సుబ్రహ్మణ్యానికి మంగళవారం ఉదయం గుండెపోటు రావడంతో స్థానికంగా ఉన్న ఓ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు పరీక్షించి అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి మృతి చెందాడన్న వార్తతో కుమార్తె లక్ష్మీ శ్రావణి ఒక్కసారిగా కుంగిపోయింది. తనను ఎంతో అల్లారుముద్దుగా పెంచిన తన తండ్రి విగత జీవిగా కన్పించడంతో మనోవేదనకు గురైంది. రోదిస్తూనే ఇంటికి దగ్గరలో ఉన్న అపార్ట్‌మెంటు పైకి వెళ్లింది. తండ్రి లేకుండా తను జీవించ లేనన్నట్లుగా పైనుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అపార్ట్‌మెంటు వాచ్‌మెన్ ఇది గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. తీవ్ర గాయాలతో ఉన్న లక్ష్మీశ్రావణిని పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి కుమార్తె వెనువెంటనే మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతిరాలి తల్లి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చినకొండ్రుపాడు వద్ద గల పోలిశెట్టి టొబాకో కంపెనీలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ బుజ్జి హుస్సేన్ (63) స్థానిక పోలిశెట్టి టుబాకో కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం కంపెనీలో ఉన్న దేవుడి విగ్రహాలను పూజ నిమిత్తం కడిగేందుకు ప్రాంగణంలోనే ఉన్న చెరువు వద్దకు హుస్సేన్ వెళ్లాడు. బకెట్‌తో నీరు తోడుతూ.. జారి పడిపోయాడు. తోటి ఉద్యోగులు కాపాడే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది. భార్య అబ్బలున్‌బీ ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను తీసుకెళ్లిన వ్యక్తిపై పోక్సో కేసు

మాచర్లటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి తనతో తీసుకెళ్లిన వ్యక్తిపై పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీకి చెందిన బాలిక తొమ్మిదో తరగతి వరకు చదువుకుంది. బాలిక తల్లి చనిపోగా తండ్రి వేరే మహిళను వివాహం చేసుకొని వెళ్లిపోయాడు. దీంతో బాలిక తన అమ్మమ్మ వద్ద ఉంటోంది. తన అమ్మమ్మ ఆరోగ్య సమస్యల నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు ఆమెతో కలిసి వచ్చేది. అదే ప్రాంతంలోని చికెన్ షాపులో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆ బాలికకు మాయమాటలు చెప్పి పరిచయం పెంచుకున్నాడు. ఈనెల 3న ఇద్దరూ పట్టణం నుంచి వెళ్లిపోయారు. బాలిక కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు ఇద్దరూ తెనాలిలో ఉన్నట్లు గుర్తించి.. పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలికను తీసుకెళ్లిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

విద్యాహక్కు చట్టం ప్రవేశాల నిరాకరణపై ఆందోళన



ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

గుంటూరు (విద్య) జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనేక పాఠశాలలు విద్యా హక్కు చట్టం ద్వారా ఎంపికైన విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకోవడం లేదని సిటిజెన్ రైట్స్ అధ్యక్షుడు ఎస్కే జిలాని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టం ద్వారా ఎంపికై.. పాఠశాలలో అడ్మిషన్ నిరాకరించిన పిల్లల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో గుంటూరు ఎంఈఓ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అడ్మిషన్ల కోసం పాఠశాలకు వెళ్తే యాజమాన్యాలు తల్లిదండ్రులను అవమానాలకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. పేద బడుగు బలహీన వర్గాల పిల్లల్ని ఒకటో తరగతిలో చేర్పించేందుకు విద్యా హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశామని, అయితే యాజమాన్యాలు ప్రవేశాలను నిరాకరిస్తున్నాయని చెప్పారు. ఇటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏపీ సిటిజన్స్ రైట్స్ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్‌టీఈ ప్రవేశాలను నిరాకరించే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 511.90 అడుగులు ఉంది. ఇది 134.91 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ల రద్దు


గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ఆదరణ లేని కారణంగా రెండు స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07041) సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ రైలుని ఈ నెల 12న, (07042) కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ రైలుని ఈ నెల 13న నుంచి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే టికెట్‌లు బుక్ చేసుకొన్న వారికి పూర్తి రీఫండ్ చేస్తామన్నారు.

డివైడర్ ఢీకొన్న ద్విచక్రవాహనం మహిళ మృతి

బాపట్లరూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా.. ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బేతపూడి గ్రామానికి చెందిన రాజు శ్రీనివాసరెడ్డి, గవినివారిపాలేనికి చెందిన శివకుమారి ద్విచక్ర వాహనంపై బాపట్ల పట్టణం నుండి సూర్యలంక వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కనకాద్రి నగర్ సమీపంలోని డివైడర్‌కు వేగంగా వారి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమారి (43) అక్కడికక్కడే మృతి చెందగా.. రాజుశ్రీనివాసరెడ్డి తలకు తీవ్ర గాయం కావడంతో బాపట్ల ఏరియా వైద్యశాలకు స్థానికులు తరలించారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు

● రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల



వర్సిటీలోనీ లైబ్రరీలో పరిశీలన చేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

పెదకాకాని, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాల సంఖ్య, వార్షిక బడ్జెట్, విద్యార్థులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. పోటీ పరీక్షల విభాగంలోని విద్యార్థులతో చర్చించారు. మెరుగైన సేవలకు సూచనలు ఇచ్చారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గ్రంథాలయాల అభివృద్ధికి అంకితభావంతో నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. వర్సిటీ గ్రంథాలయ అధికారి కె.వెంకట్రావు, ఎస్వీఆర్ విద్యా సంస్థల అధిపతి వై. వెంకట్రామయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.శ్రీనివాసరావు ఉన్నారు.

మూడు లోకోలు ఫెయిల్యూర్

● గంటల తరబడి ఆలస్యంగా నడిచిన రైళ్లు ● ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడిన ప్రయాణికులు

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఒకే రోజున మూడు రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల లోకోమోటివ్(ఇంజిన్)లు ఫెయిల్యూర్ అయ్యాయి. (17255) నరసపూర్ - లింగంపల్లి, (12806) లింగంపల్లి - విశాఖపట్టణం, (17256) లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణం ప్రారంభించి గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోకి వచ్చాక మొరాయించాయి. గమ్యస్థానాలకు రెండు నుంచి మూడు గంటల ఆలస్యంగా చేరాయి. స్టేషన్లలో కాకుండా మధ్యలో లోకోలు ఫెయిల్ కావడంతో వాటి వెనకగా, ఎదురుగా వచ్చే రైళ్లను నిలిపేయాల్సి రావడంతో అవి కూడా ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరాయి. ఉష్ణోగ్రతలు హెచ్చుగా ఉండటంతో జనరల్, స్లీపర్ క్లాస్ బోగీల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ తిప్పర్తి రైల్వేస్టేషన్‌లో లోకో ఫెయిల్ కావడంతో రెండు గంటలకు పైగా నిలిపేశారు. ఈ రైలుకు స్టేషన్‌లో సమస్య రావడం వల్ల వెనకగా, ఎదురుగా వచ్చే రైళ్లకు ఇబ్బంది లేకపోవడంతో వాటిని పంపించేశారు. లింగంపల్లి - నరసపూర్ రైలుకు వలిగొండలో లోకో ఫెయిల్ కావడంతో గంటన్నరకు పైగా అక్కడ నిలుపుదల చేశారు. ఆ తర్వాత గుంటూరుకు వచ్చాక మరో లోకో అమర్చడానికి 30 నిమిషాలకు పైగా సమయం పట్టింది. గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు ఖాళీ లేకపోవడంతో రాయగడ నుంచి గుంటూరు రావాల్సిన ఎక్స్‌ప్రెస్‌ని అవుటర్‌లో 45 నిమిషాల వరకు నిలిపేశారు. లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం నల్గొండ రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించే సమయంలో లోకోలో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఆ రైలు కొంతభాగం స్టేషన్‌లోని లూప్‌లైన్‌లో, మరికొంత భాగం మెయిన్‌లైన్‌లో ఉండటంతో వెనకగా, ఎదురుగా వచ్చే రైళ్లను నిలిపేయాల్సి వచ్చింది. హౌరా నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరిన ఫలక్‌నూమ ఎక్స్‌ప్రెస్‌ని నల్గొండలో 40 నిమిషాలకు పైగా నిలిపేశారు. (07421) చర్లపల్లి - శ్రీకాకుళం స్పెషల్‌ని శ్రీరాంపురంలో, తిరువనంతపురం - చర్లపల్లి శబరి ఎక్స్‌ప్రెస్‌ని రాయనగూడలో గంటకు పైగా నిలిపేయాల్సి వచ్చింది. గంటల తరబడి రైళ్లను ఎందుకు నిలుపుదల చేశారన్న సమాచారాన్ని ప్రయాణికులకు చెప్పలేదు. దీంతో మండ టెండలో అవస్థలు పడ్డారు. మరోవైపు ఎన్‌టీఈఎస్‌లో ఫలక్‌నూమ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ ప్రకారం ప్రయాణిస్తోందని తప్పుడు సమాచారం అప్‌డేట్ చేశారు.

38,031 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 41,497 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,031 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,627 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13500
నెంబరు. 5	10000	12500
273	10000	12500
341	10000	13500
4884	---	---
సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000
షార్క్-1	10000	12000
బ్యాడిగి	10000	13000
దేవనూరు డీలక్స్	10000	13000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	11200
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	14000
నెంబరు. 5	10000	13500
273	10000	13000
341	10000	14500
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14600
బ్యాడిగి	10000	13500
దేవనూరు డీలక్స్	10000	13800
తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని

బాపట్ల,జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఈఏపిసెట్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్నట్లు బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల ఆవరణలో మంగళవారం ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు పురస్కారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముప్పలనేని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కళాశాల విద్యార్థి బిళ్ళా అకాష్ ఇమ్మానీయేల్ రాజు 1015వ ర్యాంక్‌తో టౌన్ ఫస్ట్ సాధించటం అభినందనీయమన్నారు. అదేవిధంగా కళాశాల విద్యార్థులు ఐదుగురు 10వేల లోపు ర్యాంక్‌లు, 12 మంది 20 వేలలోపు ర్యాంక్‌లు సాధించినట్లు చెప్పారు. టౌన్‌ఫస్ట్ వచ్చిన ఇమ్మానీయేల్ రాజుకు రూ.10 వేల నగదు పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా 10వేలలోపు ర్యాంక్‌లు వచ్చిన ఐదుగురు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ఇవ్వటం జరిగిందన్నారు. ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది విద్యార్థులు డాక్టర్‌లు, ఇంజనీర్లు అయినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 5వేల రూపాయల చొప్పున ఎడ్యుకేషన్ సొసటీ యాజమాన్యం బహూకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కోట వీరబ్రహ్మయ్య, ఉపాధ్యక్షుడు కారుమంచి వెంకట్రావు, పారేపల్లి చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి బిళ్ళా అకాష్ ఇమ్మానియేల్ రాజుకు నగదు పురస్కారం అందజేస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు

దుగ్గిరాల గోపాలకృష్ణయ్యకు ఘన నివాళి

బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్థంతి కార్యక్రమాన్ని మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ పి.సీతాభవానీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి ఎ.మల్లికార్జునరావు, చిత్రకారుడు జీవీ, ఉపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ నాయకులు కాగిత కోటేశ్వరరావు, ఎం.నరసింహారావు, మణికంఠ, సాయిబాబు, జి.రాజారావు, డి.చెంచుబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్ర రత్నదుగ్గిరాల గోపాలకృష్ణయ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న అధికారులు, నాయకులు

కిశోర బాలికల వేసవి సెలవులు ముగింపు

పిట్టలవానిపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీ రెడ్లపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో కిశోర బాలికల వేసవి సెలవులు ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అల్లూరు గ్రామసర్పంచ్ ఉప్పు చెంచు లక్ష్మీ, అల్లూరు సచివాలయ కార్యదర్శి ఎ.పద్మావతి, ఇన్‌చార్జి మహిళా సంరక్షణ కార్యదర్శి సామరౌతు ఉమారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వక్కల కిశోర బాలికలకు విద్య ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిర్మూలన, బాలలహక్కులు రక్షణ, పీవోజీఎస్ చట్టం గురించి వారికి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకై కిశోర బాలికలచేత వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు.

● మండలంలో పోతనకట్టవారిపాలెం సచివాలయంలో మంగళవారం కిశోర బాలికల సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పోతన కట్టవారిపాలెం గ్రామసర్పంచ్ యెనుముల పార్వతి, సచివాలయ కార్యదర్శి కొండా గోపికృష్ణ, కిశోర బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు. గ్రామ సంరక్షణ కార్యదర్శి సామరౌతు ఉమారాణి మాట్లాడుతూ కిశోర బాలికలకు విద్య ప్రాముఖ్యత, ఆహారం, పోషకాహారం, బాల్య వివాహాల నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకై కిశోర బాలికలచేత వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సుభాషిణి మృతిపై కాలనీ వాసుల రాస్తాకోకో

బాపట్ల రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం ఎస్సీ కాలనీకి చెందిన డి.సుభాషిణి అనే మహిళపై భర్త పెట్రోలు పోసి నిప్పు అంటించిన ఘటనలో ఆమె సోమవారం మృతి చెందారు. అయితే సుభాషిణి మృతికి జమ్ములపాలెం ఎస్సీ కాలనీవాసులు మంగళవారం గ్రామ సమీపంలోని బాపట్ల నుంచి పెదనందిపాడు వెళ్ళే రహదారి మీద రాస్తారోకోను నిర్వహించి సుభాషిణి మృతికి న్యాయం చేయాలని, నిందితుడు సుభాషిణి భర్త హరీష్‌కు ఉరి శిక్ష విధించాలని నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. బాపట్ల రూరల్ సీఐ కె.శ్రీనివాస్ నిరసనకారులతో మాట్లాడినప్పటికి సాయంత్రం 4 గంటలకు విరమించుకున్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న మృతురాలు సుభాషిణి బంధువులు, గ్రామస్థులు

పబ్లిక్ ప్రదేశాలలో పొగతాగటం చట్టరీత్యా నేరం

● ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ

బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ ప్రదేశాలలో చుట్ట, బీడీ, సిగిరెట్ తాగటం చట్టరీత్యా నేరమని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ తెలిపారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో పొగ తాగితే రూ.200 నుంచి రూ.1000 వరకు జరిమాన విధించటం జరుగుతుందన్నారు. పొగాకు తాగటం వల్ల జరిగే నష్టాలను వివరించారు. జిల్లా పొగాకు నియంత్రాణాధికారులు బి.రమేష్, పి.సుజాత మాట్లాడుతూ కార్యాలయ చుట్టు పక్కల పొగాకు సంబంధించిన దుకాణాలను, కార్యాలయ ఆవరణలో బీడీలు, సిగిరెట్‌లు, గుట్కా, పాన్ వంటి పదార్థాలు నిషేధించటం జరిగిందన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమిపాలనలో మహిళలకు భద్రత కరువు

● మాజీ ఎమ్మెల్యే కోన, జిల్లా అధ్యక్షుడు మేరుగ

బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో మహిళలకు, బాలికలకు భద్రత కరువైందని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, జిల్లా పార్టీ అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. ఈ విషయమై మంగళవారం వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో రథంబజారులోని వైసీపీ కార్యాలయం దగ్గర నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం, బాపట్ల ఎంపీపీలు యారం వనజ, చినపోతుల హరిబాబు, మహిళా నాయకులు మీరాబి, గొర్రెముచ్చు పుష్పరాజ్యం, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, జోగి రాజా, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఏడుకొండలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేరలి, ఈస్ట్‌శ్యాంప్ డ్రెయిన్‌లలో ఇసుక మేటలు వేసి పెరిగిపోయిన తూటి, తుంగ

డ్రెయినేజీల మరమ్మతులు లేనట్టేనా?

● గడ్డి ముందు పిచికారి చేసేందుకు మాత్రమే నిధులు

● ఆయుకట్టు రైతుల ఆందోళన

బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ళ వైసీపీ పాలనలో డ్రెయినేజీల మరమ్మతులను పూర్తిగా వదిలేశారు. దీనివల్ల అనేకసార్లు వరదలు సంభవించి డ్రెయిన్‌లు పొంగి పొలాలు మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కాల్వల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అయితే డ్రెయినేజీల మరమ్మతులకు మాత్రం నిధులు మంజూరు చేయలేదు. కేవలం డ్రెయినేజీలలో ఉన్న తూటి, తుంగ నిర్మూలించేందుకు కెమికల్ స్ప్రే చేసేందుకు మాత్రమే ఓ అండ్ ఎం నిధులు మంజూరు చేశారు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో 36 పనులకు గాను రూ.86 లక్షల 54 వేలు మంజూరు చేశారు. నిధులు మంజూరైనప్పటికి పనులు చేయటంలో జాప్యం చేస్తున్నారు. డ్రెయినేజీలో పేరుకుపోయిన ఇసుకమెటలు, ముళ్ళచెట్లు తొలిగించే అవకాశం లేకుండా పోయింది. గడ్డి నిర్మూలనకు మాత్రమే డ్రోన్‌ల ద్వారా కెమికల్స్ పిచికారి చేయనున్నారు. సాగుకు చివర, ముంపునకు ముందల అన్నట్లు ఉన్న సముద్రతీరప్రాంత గ్రామాలలో ప్రవహించే డ్రెయినేజీలలో ఇసుకమేటలు తొలిగించకపోతే మురుగునీరు సజావుగా ప్రవహించదు. దీనివల్ల నీరు పొంగి పొలాల్లోకి ప్రవహించే ప్రమాదం ఉంది. వెదుళ్ళపల్లి డ్రెయినేజీ కార్యాలయం దగ్గర పేరలి డ్రెయిన్‌లో ఇసుక మెటలు వేసి తూటి, తుంగ పెరిగిపోయింది. కట్టల పక్కనే ముళ్ళచెట్లు పెరిగి డ్రెయినేజీలోకి వాలాయి. నల్లమడ డ్రెయిన్‌లో కలిసే ఈస్ట్ శ్యాంప్ డ్రెయిన్, పేరలి డ్రెయిన్‌లో కలిసే వెస్ట్‌శ్యాంప్ డ్రెయిన్‌ల మరమ్మతులు కూడా జరిగే పరిస్థితి కనిపించటం లేదు. ఈడ్రెయిన్‌లలో కూడా గడ్డి నిర్మూలనకు మందు పిచికారి చేయటం మాత్రమే జరుగుతుంది. అదేవిధంగా అప్పికట్ల డ్రెయిన్, జమ్ములపాలెం రోడ్డులో ఈస్ట్, వెస్ట్ డ్రెయిన్‌లు, పిన్నిబోయనవారిపాలెం డ్రెయిన్, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలోని డ్రెయిన్‌లలో మట్టి తవ్వి కట్టలు పటిష్ట పర్చే కార్యక్రమం జరిగే పరిస్థితి కనిపించటంలేదు. ఈ ఏడాదికి గడ్డి నిర్మూలన పనులు మాత్రమే చేయనున్నట్లు డ్రైనేజి అధికారులు చెబుతున్నారు. గత ఏడాది వరదల సమయంలో డ్రైనేజిలలో నీరు ముందుకు ప్రవహించక ఈప్రాంతంలో పొలాలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయారు. అధికారులు, పాలకులు డ్రెయినేజీ సమస్యలపై దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.



బాపట్ల డంపింగ్ యార్డు దగ్గర వెస్ట్‌శ్యాంప్ డ్రెయిన్‌లో పెరిగిన తూటి

త్రిముఖ దేవాలయాలకు ఈవోగా ఘంటసాల



ఘంటసాల నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో గల త్రిముఖ దేవాలయాలకు కార్యనిర్వాహణాధికారిగా ఘంటసాల నరసింహమూర్తిని రెగ్యూలర్ బాధ్యతలు పొందారు. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. పెద్దవరం గ్రూప్ దేవస్థానంలో జూనియర్ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న నాగుల శ్రీనివాసరావును చందోలు దేవస్థానాలకు బదిలీ చేసినట్టు నియామక ఉత్తర్వులను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు జారీ చేశారని చందోలు త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

● విస్తరణా శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు

బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని అన్ని రంగాలలో ముందుండాలని విస్తరణా శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు తెలిపారు. బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రం లో స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత- గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు అనే అంశంపై మహిళా సర్పంచ్‌లకు నాలుగురోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వెంకట్రావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాన్ని వినియోగించుకుంటూ సామాజిక న్యాయంతో కూడిన ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మహిళా నాయకత్వంలో మార్పు స్థానిక స్వపరిపాలనలో సాధికారిత, స్థానిక పాలనలో మహిళలకు అవకాశాలు తదితర అంశాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల నుంచి 33 మంది మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపమండల ప్రజాపరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. వీరికి మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు.



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న విస్తరణా శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు

ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ఇంటింటి సర్వే

పిట్టలవానిపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని భవితా కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా సమగ్ర శిక్ష ఐఈ సీవోవోఆర్ఐఎన్ఏటీవోఆర్ మట్టా జోత్స్న మండలంలోని చందోలు గ్రామంలో ఆకస్మింగా తనిఖీలు నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా పిల్లల వివరాలు సేకరించటం జరుగుతుందని, తల్లిదండ్రులు, అధికారులు సహకరించి ప్రత్యేక అవసరాల గల పిల్లల సర్వేను విజయవంతం చేయాల్సిందిగా వివరించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈ కోఆర్డినేటర్ మట్టా జోత్స్న, ఐఈఆర్‌సీ రత్నబాబు, ఐఈఆర్‌టి వెంకట్ పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను ఆదుకోవాలి : ఎంపీడీవో



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో బి.బాబురావు

బాపట్లరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఎంపిక చేయబడిన పీ4 మార్గదర్శకులు పేదరికం, దిగువ స్థాయిలో ఉన్న వారిని ఆదుకోవాలని ఎంపీడీవో బాబురావు అన్నారు. పడమర బాపట్ల గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమం ప్రతి గ్రామంలో అమలు చేసేవిధంగా పంచాయతీ కార్యదర్శులు చూడాలన్నారు. గ్రామపంచాయతీలో 175 బంగారు కుటుంబాలకు 18మంది పీ4 మార్గదర్శకులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చదలవాడ రవి కృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

బాపట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టటంతో తీవ్రగాయాలైన సంఘటన బాపట్ల పట్టణంలో జరిగింది. పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని కంకటపాలెం గ్రామానికి చెందిన శీలం విజయ్‌కుమార్ తన మేనత్తను బైక్‌పై మంగళవారం చింతలపూడి గ్రామంలో దింపి వస్తుండగా చీరాల బస్టాండ్ దాటే సరికి వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టింది. దీంతో ఆయనకు గాయాలు కాగా ఆసుపత్రిలో చేరి ఇచ్చిన రిపోర్ట్‌మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న సీడీపీవోఎం.సుచిత్ర,అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రేపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సంఘటితంగా బాల్యవివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీవో ఎం.సుచిత్ర అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టులో కిషోర్‌వికాసం, సమ్మర్‌శిక్షణ ముగింపు కార్యక్రమం సందర్భంగా బాల్యవివాహాల నిర్మూలన కోసం కట్టుబడి ఉందామంటూ బుధవారం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల కనీస వివాహ వయసు 18 సంవత్సరాలు ఉండాలని, బాలురకు 21 సంవత్సరాలు ఉండాలని చట్టబద్ధంగా నిర్ణయించబడిందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివజ్యోతి, మహిళా సంరక్షణ కార్యదర్శి హిమబిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, కిషోర్‌బాలికల తల్లులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలతో నిరుద్యోగులకు జీవనోపాధి

● ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గాయత్రి

వేమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌మేళాల ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు జీవనోపాధి కల్పించడం జరుగుతుందని వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.గాయత్రి అన్నారు. కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ బాపట్ల జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 10 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు. 163 మంది నిరుద్యోగ యువతులు హాజరు కాగా వారిలో 77 మంది వివిధ కంపెనీలకు సెలెక్ట్ అయ్యారు. వారికి ప్రిన్సిపల్ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్, ఏపీఎస్ఎస్ డీసీ కోఆర్డినేటర్ రాజేశ్వరి, సిడాప్ జేసీ జాబ్ కో-ఆర్డినేటర్ అరుణ్, హరీష్, రాజేష్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో నమోదు కావాలి

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు పొందేందుకు హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో నమోదు కావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. భట్టిప్రోలులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, చాలా మంది తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో రైస్‌కార్డులో ఉన్నా హౌస్ హోల్డింగ్ మ్యాప్‌లో నమోదు కాలేదని తమ దృష్టికి రావడం జరిగిందన్నారు. అలాంటి వారందరూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాల అమలుకు హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్ ప్రామాణికమని జీవో జారీ చేసిందని తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రైస్‌కార్డులోనే కాకుండా హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో కూడా నమోదు చేయించుకోవాలని సూచించారు. లేని పక్షంలో వారు సంక్షేమ పథకాలకు అనర్హులవుతారన్నారు.

రహదారికి అడ్డంగా ఉన్న ముళ్ళచెట్లు తొలగింపు

రేపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన రహదారులకు రెండు వైపులా ఏపుగా పెరిగిన ముళ్ళచెట్లను బుధవారం పంచాయతీ అధికారుల సమక్షంలో తొలగించారు. నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదాలకు నిలయంగా మారటంతో అధికారులు స్పందించి బుధవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళచెట్లను తొలగించారు. దీంతో ప్రయాణికులకు రాకపోకలు సులభతరంగా మారనున్నాయి.

బీచ్ కబడ్డీలో ఆంధ్ర జట్టుకు ట్రోఫీ

చెరుకుపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : 12వ జాతీయ బీచ్‌కబడ్డీ పోటీలు ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మచిలీపట్నంలోని మంగినపూడిబీచ్‌లో జరిగాయి. ఈ పోటీలలో ఆంధ్ర బీచ్ కబడ్డీ జట్టు ట్రోఫీ సాధించింది. ఈ జట్టుకు మే 25వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు పొన్నపల్లిలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించామని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఎం.సుబ్బరాజు గూడవల్లిలో జరిగిన ఒక కార్యక్రమంలో తెలిపారు. ఈ జట్టుకు సీనియర్ కోచ్‌లు వైఎస్ఆర్ ప్రసాద్, రాధాకృష్ణారెడ్డి శిక్షణ ఇచ్చారని చెప్పారు.

తీన్‌మార్ బ్యాండ్‌తో ప్రభుత్వ పాఠశాల అడ్మిషన్లపై ప్రచారం

తెనాలి అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం తీన్‌మార్ బ్యాండ్‌తో ప్రచారం చేశారు. వేటపాలెం హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయన మంగళవారం చుండూరు మండలంలోని నడిగడ్డపాలెంలో ఈ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ చేస్తున్న ప్రచారం ఆకట్టుకుంది. ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం ఆయన చేస్తున్న కృషిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా చెన్నమల్లేశ్వరస్వామి కల్యాణం

● పట్టువస్త్రాలు సమర్పించిన శివప్రసాద్

రేపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇసుకపల్లిలో ఉన్న శ్రీ భ్రమరాంబసమేత చెన్నమల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యదర్శి దివి వెంకటఅప్పలాచార్యులు ఆధ్వర్యంలో చెన్నమల్లేశ్వరస్వామి కల్యాణం సందర్భంగా ఉదయం ఔపోసనహోమం, బలిహరణ, ఎదరోత్సవం కార్యక్రమాలు రాత్రి 8 గంటలకు చెన్నమల్లేశ్వరస్వామి కల్యాణం ఆలయ అర్చకులు కొమ్మూరి కృష్ణప్రసాద్, పవన్‌కుమార్‌శర్మ వేదమంత్రోచ్ఛరణతో జరిగింది. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణమహోత్సవం పూజలో పాల్గొన్నారు. దేవదాయ శాఖాధికారులు ఆధ్వర్యంలో ఆశీర్వచనం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, కొలసాని రాము, ముత్తవరపు తేజ్‌కుమార్, అడిగోపుల శంకర్, కరేటి కోటి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు శివప్రసాద్ తదితరులు

విద్యాహక్కు చట్టం పూర్తి స్థాయి అమలుకు సీసీఆర్ కృషి

● కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా కన్వీనర్ కోటినాగయ్య



విలేకర్లతో మాట్లాడుతున్న కోటినాగయ్య తదితరులు

వేమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం అంశాలను పూర్తి స్థాయిలో అమలు పరిచేందుకు కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ కృషి చేస్తుందని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా కన్వీనర్ కోటినాగయ్య అన్నారు. వేమూరులో మంగళవారం పర్యటించిన ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, విద్యాహక్కు చట్టం సెక్షన్ 12-1-సి ప్రకారంగా రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ అన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో వెనుకబడిన వర్గాల కుటుంబాల విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించడం జరిగిందన్నారు. దీన్ని పాఠశాలల సంస్థల అమలు పరచని కారణంగా తాము ఉద్యమంగా తీసుకుని జిల్లా, మండల స్థాయిలోని విద్యాశాఖ అధికారులతో పాటు కలెక్టర్‌లకు వినతి పత్రాలు సమర్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బాపట్ల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించి వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో విద్యాశాఖ అధికారులను కూడా కలవడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కర్రి అశోక్ చక్రవర్తి, మునగాల గిరిధర్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆనందబాబు పర్యటన

వేమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 61 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 కోట్ల 17 లక్షల నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా ఫేజ్-1లో మూడు మండలాల పరిధిలో నిర్మాణాలు పూర్తయిన 13 సీసీ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటలకు చుండూరు మండలం చినపరిమి, మండూరు గ్రామాలలో, 10 గంటలకు అమృతలూరులో, 10.30 గంటలకు వేమూరు మండలం పెరవలిపాలెం గ్రామంలో, 11 గంటలకు పెరవలి గ్రామంలో ప్రారంభిస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపారు.

ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకునే వ్యక్తి బాలకృష్ణ

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

వేమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సినీ రంగంలో అంచలంచెలుగా గొప్ప నటుడిగా ఎదిగి హిందూపురం ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆశలకు అనుగుణంగా వ్యవహరిస్తున్న వ్యక్తి నందమూరి బాలకృష్ణ అని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. వేమూరులో మంగళవారం బ్రాహ్మణి ఫొటో స్టూడియో అధినేత తుమ్మల సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో బాలకృష్ణ 65వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయబాబు బర్త్ డే కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతూ, బాలకృష్ణ సేవా తత్పరతను, నటన కౌశల్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నె వసి, తుమ్మల శ్రీనివాసరావు, కొల్లి వెంకటేశ్వరరావు, అన్నే వీరాంజనేయప్రసాద్, యలవర్తి సురేంద్ర, కోగంటి సుధీర్, కోగంటి రాజేష్, జోగి సాయిమణికంఠ, నందమూరి యువసేన సభ్యులు, పలువురు అభిమానులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బాలకృష్ణ బర్త్ డే కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

కర్రసాము పోటీల్లో ఐలవరం విద్యార్థులకు పతకాలు



కర్రసాము పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఐలవరం విద్యార్థులు

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో ఐలవరం విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 8న పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సంప్రదాయ రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో ఐలవరం గ్రామానికి చెందిన దీపాల నవీన్ శిష్య బృందం పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సాధించారు. జూనియర్ విభాగం ఫెట్ పోటీల్లో జి.జగదీష్, జి.సాయిమణికంఠ, సబ్ జూనియర్ విభాగంలో రెండో స్థానంలో ఎ.గిరివెంకటసాయి, మూడో స్థానంలో టి.రాజు విజేతలుగా నిలిచారు. మహిళా సబ్ జూనియర్ విభాగంలో జి.గీతిక రెండో స్థానం, సీనియర్ విభాగంలో మొదటి స్థానంలో దేవికారాణి, సింగిల్ స్టిక్ విభాగంలో టి.యుగంధర్, కె.సూర్యవిశ్వేశ్వర్, డబుల్ స్టిక్ విభాగంలో జి.లిఖిత్, ఎం.సంజయ్, ప్రేమస్వరూప్, జి.నితిన్ పతకాలు సాధించారు. విజేతలను పెదనందిపాడు కూటమి నాయకులు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు రావి శివరామకృష్ణ, ఆర్గనైజర్, చీఫ్ కోచ్ చెవ్వుల శ్రీరామ్ తదితరులు అభినందించారు. శిక్షణ ఇచ్చిన నవీన్‌ను ఘనంగా సత్కరించారు.

12 నుంచి పాఠశాలల్లో తరగతులు ప్రారంభం

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 12వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు ఎంఈవో ఎస్.దేవరాజు పేర్కొన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ఎంఈవో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన చేస్తున్నట్లు అన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, సమదుస్తులు ప్రభుత్వం నుంచి సకాలంలో సరఫరా అవుతాయని తెలిపారు.

బలమిచ్చేలా బడి బువ్వ

● సర్కారు బడులకు చేరిన సన్న బియ్యం ● మధ్యాహ్న భోజనంలో మార్పులు

రాజుపాలెం, జూన్10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. గతేడాది అక్టోబరులో పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి అభిప్రాయాలు సేకరించింది. స్థానికంగా ఉండే అభిరుచులకు అనుగుణంగా మెనూలో మార్పులు చేసింది. తాజాగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది.

25 కేజీల సంచులు..అక్రమాలకు చెక్..

మధ్యాహ్న భోజనం కోసం ప్రత్యేకంగా 25 కేజీల సంచులు సిద్ధం చేశారు. గతంలో 50 కేజీ బస్తాలను సరఫరా చేసేవారు. అవి ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పురుగులు పట్టేవి. సగానికి తగ్గించడం వల్ల గుర్తించడం సులువుగా ఉంటుంది. అదే విధంగా ఎలాంటి అక్రమాలు జరగకుండా క్యూఆర్ కోడ్ ఉన్న ట్యాగ్ అమర్చుతున్నారు.



సిద్ధంగా ఉన్న సన్న బియ్యం సంచులు

పోషకాలు పెంపొందించేలా..

ప్రస్తుతం ప్రతి పది మందిలో ముగ్గురు చిన్నారులు విటమిన్లు, సూక్ష్మ పోషకాల లోపంతో బాధపడుతున్నారు. దీన్ని ఫోర్టిఫైడ్ ఆహారం ద్వారా సులభంగా పరిష్కరించవచ్చునని గుర్తించిన ప్రభుత్వం 25 కేజీల సంచిలో అర కేజీ ఫోర్టిఫైడ్ బియ్యం కలిపి ఇస్తుంది. ఫోర్టిఫైడ్ బియ్యం కలిపిన సన్న బియ్యం కావడంతో నీటిలో ఎంత వరకు కడగాలనే దానిపైనా వంట నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు.

450 సంచులు కేటాయింపు

రాజుపాలెం కేంద్రంగా ఉన్న పౌర సరఫరాల గోదాము నుండి రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు సన్న బియ్యం సరఫరా చేశారు. రాజుపాలెం మండలానికి 268, బెల్లంకొండకు 182 సంచులు సరఫరా చేసినట్లు ఎంఈవో మల్లికార్జునశర్మ తెలిపారు.

ఇంటీరియర్ పనులు త్వరగా పూర్తిచేయాలి

● గుత్తేదారు సంస్థకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాలు


అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

తుళ్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో నిర్మాణం చేపట్టిన భవనాల ఇంటీరియల్ పనులను త్వరగా పూర్తిచేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ అధికారులతో కలిసి అమరావతిలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు పూర్తయిన ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గృహాలను పరిశీలించారు. గృహాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలుసుకుని సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీల బంగ్లాలు, హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులకు పలు ఆదేశాలు జారీ చేశారు. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు, ఈ6, ఈ12, ఎన్14 రహదారుల వద్ద జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కొరకు చేనేత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వసతి సముదాయాలను, కార్మికుల పిల్లలకు కల్పిస్తున్న మౌలిక వసతులను ఆయన అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సీఆర్‌డీఏ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజనీర్ (ఇన్‌ఫ్రా) సీహెచ్ ధనుంజయ, చీఫ్ ఇంజనీర్ (హౌసింగ్ అండ్ బిల్డింగ్స్) ఎన్ శ్రీనివాసులు, చీఫ్ ఇంజనీర్ హౌసింగ్ అండ్ బిల్డింగ్స్ (నిర్వహణ విభాగం) డీ శ్రీరామచంద్రమూర్తి, చీఫ్ ఇంజనీర్ (కార్యాలయాలు) పీవీకే భాస్కర్, ఎస్ఈ బిట్ర శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


గుంటూరులో సాక్షి పత్రిక ప్రతులను దహనం చేస్తున్న మహిళలు


పెదకూరపాడులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు, బెలూన్లతో భారీ ర్యాలీ

మహిళల ఆగ్రహ జ్వాల

రాజధాని మహిళలపై సాక్షి న్యూస్ చానల్‌లో ప్రసారమైన అసభ్యకర వ్యాఖ్యలపై నిరసనలు కొనసాగుతున్నాయి. మహిళల ఆగ్రహ జ్వాల రగులుతూనే ఉంది. సదరు చానల్‌ను బ్యాన్ చేసి, యాజమాన్యం తక్షణమే మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు పెదకూరపాడులో మహిళలు నల్ల రిబ్బన్లు ధరించి, నల్ల బెలూన్లతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. చిలకలూరిపేటలోనూ ఇదే తరహాలో ప్లకార్డులతో తెలుగు మహిళలు ఆందోళన చేపట్టారు. తెనాలిలో జరిగిన మహిళల నిరసన ర్యాలీలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర పాల్గొన్నారు. గుంటూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో సదరు పత్రికా ప్రతులను మహిళలు తగలబెట్టారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయాలంటేనే భయపడే విధంగా కఠిన చట్టాలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

-ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


తెనాలిలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ శ్రేణులు


సాక్షి పత్రిక, ఛానల్‌ను మూసి వేయాలని సత్తెనపల్లిలో తెలుగు దేశం, బీజేపీ, జనసేన నిర్వహించిన ర్యాలీ


చిలకలూరిపేటలో తెలుగు మహిళల భారీ ర్యాలీ

ఆసక్తికరంగా జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు లయోలా పబ్లిక్ పాఠశాలలో జరిగిన ఏపీసీఐ ఎస్‌సీఈ పాఠశాలల జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ఆసక్తికరంగా జరిగాయి. తొలుత ప్రారంభ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి ఆంటోని, ప్రిన్సిపల్ డాక్టర్ నగయరాజ్ మార్క్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీలను వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ నరేష్ ప్రారంభించారు. పోటీలలో అండర్-14 విభాగంలో లయోలా పాఠశాల- నల్లపాడు, లిటిల్ ఫ్లవర్ స్కూల్- గుంటూరు, హైదరాబాదు పబ్లిక్ స్కూల్- కడప, జట్లు పాల్గొనగా, అండర్-17


విజేతలతో పాఠశాల కరస్పాండెంట్ పోతిరెడ్డి ఆంటోని, ప్రిన్సిపాల్ నగయరాజ్

విభాగంలో లయోలా పాఠశాల- నల్లపాడు, స్టెమ్ పాఠశాల గుంటూరు జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జరిగిన పోరులో అండర్-14లో హైదరాబాదు పబ్లిక్ స్కూల్, అండర్-17 విభాగంలో లయోలా పాఠశాల జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి ఆంటోని ట్రోఫీ ప్రదానం చేశారు. పోటీలను పాఠశాల క్రీడ విభాగాధిపతి పట్టేటి బాపూజీ పర్యవేక్షించారు.

తాగునీరు @ 24/7

(5వ పేజీ తరువాయి)

సరఫరాకు అవసరమైన చర్యలను పబ్లిక్‌హెల్త్ అధికారులు చేపట్టారు. ఏడాది లోపు ఆయా పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇక ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో లక్ష జనాభా దాటిన పట్టణాల్లో అమృత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అమృత్ పథకాన్ని ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పనులను అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఆ పనులను పట్టాలెక్కించింది. రక్షిత మంచినీటి పథకాలను విస్తరిస్తున్నారు. నరసరావుపేటలో రూ.29.42 కోట్లతో, గుంటూరులో రూ.381.12 కోట్లు, తెనాలిలో రూ.61.61 కోట్లు, చిలకలూరిపేటలో రూ.160.90 కోట్లతో అమృత్2.0 కింద పనులు చేపట్టనున్నారు.

135 లీటర్లు దాటితే పన్ను

ఒక్కొక్కరికి రోజుకు 135 లీటర్ల నీరు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇంతకు మించి నీటిని వినియోగిస్తే అదనపు నీటి పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. నీటి వినియోగాన్ని లెక్కించేందుకు మీటర్లు ఏర్పాటు చేస్తారు. నీటి పన్ను ఒక్కో పట్టణంలో ఒక్కోరకంగా ఉంది. ఉదాహరణకు నరసరావుపేటలో నెలకు ఇంటికి రూ.100 నీటి పన్ను చెల్లించాలి. ఇంట్లో ఎంతమంది ఉన్నారో గుర్తించి ఒక్కొక్కరికి 135 లీటర్ల చొప్పున వినియోగానికి నెలకు రూ.100 పన్ను చెల్లిస్తే సరిపోతోంది. ఇంతకు మించి వినియోగిస్తే అదనంగా పన్ను వసూలు చేస్తారు. నీటి వృథాను అరికట్టేందుకే ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు కొండవీడుకోటలో..

యోగాంధ్ర మహోత్సవం

● ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల హాజరు

యడ్లపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చారిత్రక కొండవీడు కోటలో బుధవారం యోగాంధ్ర మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర - 2025 పేరుతో చేపట్టిన మాసోత్సవాల్లో.. రాష్ట్రంలోని 100 ప్రముఖ పర్యాటక, చారిత్రాత్మక ప్రాంతాల్లో యోగా ప్రచారాన్ని కొనసాగిస్తోంది. కొండవీడుకోట ఘాట్ మార్గం చెక్‌పోస్టు వద్ద ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు గంటన్నర పాటు యోగా ప్రదర్శన జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, డ్వాక్రా సంఘాల మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.


కొండవీడుకోట ఘాట్ మార్గం


కొండవీడుకోట ఘాట్ మార్గంలో ఏర్పాటుచేసిన ప్రవేశద్వారం


ధర్నాకు డబ్బులు ఇచ్చి తీసుకొచ్చిన జనం


వచ్చిన జనాభాను లెక్కిస్తున్న కార్యకర్తలు

తలకింత!

వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు జనాలు రాక నానా తంటాలు పడుతున్నారు. చేసేది లేక తలకింత అంటూ లెక్క కట్టి జనాన్ని తరలించి మహా ధర్నా అంటూ తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లో మంగళవారం జరిగిన ధర్నా కూడా ఇదే తంతు. పట్టణ వైసీపీ నాయకురాలు నూరి ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డబ్బులు ఇచ్చి మహిళలను తరలించారు. ఒక్కొక్కరిని లెక్కిస్తూ ఇలా ఫొటోలకు దొరికారు.

-గుంటూరు,ఆంధ్రజ్యోతి

ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీ

● వసతులపై జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి ఆరా

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ ఎస్. సురేష్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్‌తో కలిసి బస్టాండ్‌లోని గుంటూరు-1, 2 డిపోల్లోని గ్యారేజ్‌లతో పాటు బస్టాండ్ ఆవరణలో పర్యటిస్తూ పరిశుభ్రత, సౌకర్యాలపై ఆరా తీశారు. డిపో గ్యారేజ్‌లలో సిబ్బందితో మాట్లాడారు. పనిముట్లతో పాటు వారికి అందుతున్న సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. బస్సులు ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచాలని సూచించారు. ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉన్న బస్సు ఎక్కిన చైర్మన్ ప్రయాణికులతో మాటామంతి కలిపారు. డ్రైవర్‌తో మాట్లాడి ఆక్యుపెన్సీ ఎలా ఉంది అంటూ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బస్టాండ్ లోని హోటల్స్, స్టాల్స్‌ను తనిఖీ చేసిన ఆయన ఎమ్మార్పీ మించి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి స్పష్టం చేశారు. సంస్థకు కొత్త బస్సులతో పాటు ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్ సురేష్‌రెడ్డికి డీపీటీవో రవికాంత్, ఏటీఎం సత్యనారాయణ, గుంటూరు 1, 2 డిపో ఇన్‌చార్జి మేనేజర్లు , సూపర్‌వైజర్లు, యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.


ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడుతున్న చైర్మన్ సురేష్‌రెడ్డి


ఎన్‌టీఆర్ బస్టాండ్ ఆవరణలో పర్యటిస్తున్న చైర్మన్ సురేష్‌రెడ్డి పక్కన డీపీటీవో రవికాంత్ తదితరులు

రేపు కడవకుదురులో అథ్లెటిక్స్ ఎంపిక

చినగంజాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 12వ తేదీన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగిరెడ్డి స్వామిరెడ్డి, ఎం.వెంకటరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే అథ్లెట్లు 2007 జూన్ 7వ తేదీకి ముందు పుట్టినవారై ఉండాలని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మార్కుల సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో 12వ తేదీ ఉదయం 8గంటలకు హాజరుకావాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన అథ్లెట్స్‌ను ఆంధ్రప్రదేశ్ సీనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక చేస్తామని, వివరాలకు 7416825797, 9542354041, 9666685664 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తాగునీరు ఎట్ 24/7

(5వ పేజీ తరువాయి)

సరఫరాకు అవసరమైన చర్యలను పబ్లిక్‌హెల్త్ అధికారులు చేపట్టారు. ఏడాది లోపు ఆయా పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇక ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో లక్ష జనాభా దాటిన పట్టణాల్లో అమృత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అమృత్ పథకాన్ని ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పనులను అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఆ పనులను పట్టాలెక్కించింది. రక్షిత మంచి నీటి పథకాలను విస్తరిస్తున్నారు. నరసరావుపేటలో రూ.29.42 కోట్లతో, గుంటూరులో రూ.381.12 కోట్లు, తెనాలిలో రూ.61.61 కోట్లు, చిలకలూరిపేటలో రూ.160.90 కోట్ల వ్యయంతో అమృత్ 2.0 కింద పనులు చేపట్టనున్నారు.

135 లీటర్లు దాటితే పన్ను

ఒక్కొక్కరికి రోజుకు 135 లీటర్ల నీరు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇంతకు మించి నీటిని వినియోగిస్తే అదనపు నీటి పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. నీటి వినియోగాన్ని లెక్కించేందుకు మీటర్లు ఏర్పాటు చేస్తారు. నీటి పన్ను ఒక్కో పట్టణంలో ఒక్కోరకంగా ఉంది. ఉదాహరణకు నరసరావుపేటలో నెలకు ఇంటికి రూ.100 నీటి పన్ను చెల్లించాలి. ఇంట్లో ఎంత మంది ఉన్నారో గుర్తించి ఒక్కొక్కరికి 135 లీటర్ల చొప్పున వినియోగానికి నెలకు రూ.100 పన్ను చెల్లిస్తే సరిపోతోంది. ఇంతకు మించి వినియోగిస్తే అదనంగా పన్ను వసూలు చేస్తారు. నీటి వృథాను అరికట్టేందుకే ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సహకార శాఖలో బదిలీలు

- డీసీఏవోగా రవిరాజశేఖర్

ఒంగోలు విద్య, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సహకార శాఖలో డివిజనల్ సహకారాధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఏవోగా పనిచేస్తున్న పోలిశెట్టి రాజశేఖర్ బదిలీ అయ్యారు. ఆయనను కావలి డివిజనల్ సహకారాధికారిగా నియమించారు. నెల్లూరు జిల్లా గుడూరు డివిజనల్ సహకారాధికారిగా పనిచేస్తున్న జి.రవిరాజశేఖర్‌ను ఇక్కడ డీసీఏవోగా నియమించారు. ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా పల్నాడు జిల్లా సహకార అడిట్ అధికారిగా పనిచేస్తున్న డి. శ్రీనివాసరావును నియమించారు. ఇక్కడ డీసీఏవోగా పనిచేస్తున్న పి.రాజశేఖర్ ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా కూడా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పిరాజశేఖర్ మంగళవారం ఇక్కడి నుంచి రిలీవ్ కాగా డీసీఏవోగా రవి రాజశేఖర్, ఒంగోలు డీఎల్‌సీఏగా శ్రీనివాసరావులు బాధ్యతలు స్వీకరించారు. సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న పలువురు అధికారులు కూడా బదిలీ అయ్యారు. వినుకొండ ఎస్‌డీఏకేసీవోగా పనిచేస్తున్న ఎన్.సురేంద్రబాబును ఒంగోలు ఎస్‌డీఎల్‌సీవోగా నియమించారు అద్దంకి ఎస్‌డీఎల్‌సీవోగా పనిచేస్తున్న ఎల్.సుధాకరరావును చీరాలకు బదిలీ చేశారు. కందుకూరు ఎస్‌డీఎల్‌సీవోగా పనిచేస్తున్న వేణుగోపాలరావును ఒంగోలు జిల్లా సహకారాధికారి కార్యాలయానికి బదిలీ చేశారు. గిద్దలూరు ఎస్‌డీఎల్‌సీవోగా పనిచేస్తున్న జీ.వీరప్రసాద్‌ను మార్కాపురానికి బదిలీ చేశారు. పలువురు సీనియర్ ఇన్‌స్పెక్టర్లను కూడా బదిలీ చేశారు. దర్శి ఎస్‌డీఎల్‌సీవో కార్యాలయంలో పనిచేస్తున్న జీవీ.ప్రసాదరావును బాపట్లకు బదిలీ చేయగా, అద్దంకిలో పనిచేస్తున్న వై వెంకటేశ్వరరావును దర్శికి, బి.మాధురిని ఒంగోలు నుంచి కందుకూరు, అద్దంకిలో పనిచేస్తున్న టి. శ్రీనివాసులును ఒంగోలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

తెలుగుజాతి ఉన్నంత కాలం ఎన్‌టీఆర్ గుర్తే

జగన్ ఈ సమాజానికి పట్టిన చెద

పొత్తు ధర్మాన్ని ప్రతిఒక్కరూ పాటించాలి

మంత్రి రవికుమార్



ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి విక్టరీ చూపిస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, జూన్10(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఉన్నంత కాలం ఎన్‌టీఆర్ తెలుగు ప్రజల హృదయాలలో గుర్తుంటారని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని పార్వతీపురంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఏపార్టీ, ఏ వ్యక్తి కూడా తెలుగుదేశం పార్టీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేదన్న విషయం పలుమార్లు రుజువైందన్నారు. టీడీపీ లేకుండా చేయాలని జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా, గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక సీట్లతో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని చెప్పారు. జగన్ ఈ సమాజానికి పట్టిన చెద అని విమర్శించారు. మహిళల పట్ల వైసీపీ నేతలు అసభ్యకరంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. పార్వతీపురం ఎత్తిపోతల పథకం మరమ్మతులకు టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు చెప్పారు. పొత్తు ధర్మాన్ని అందరూ పాటించాలని నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ముందుగా బాలకృష్ణ జన్మదినం సందర్భంగా ఆయన ఫాన్స్ ఏర్పాటు చేసిన కేక్‌ను మంత్రి కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, కంచర్ల వెంకటరావు, కోట వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు

ఏడాది పాలనలోనే గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మండలంలోని గోవాడలో రూ.1.20 కోట్లతో నామ్ రోడ్డు నుంచి గోవాడ వరకు పునఃనిర్మాణం చేసిన తారురోడ్డును, టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ మార్గం ఆర్చ్‌ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు భవనాశివాగుపై బ్రిడ్జి నిర్మాణం, గుడి వరకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే మంజూరు చేస్తున్నట్లు రవికుమార్ ప్రకటించారు. అనంతరం కొత్తకొటికలపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. పార్వతీపురంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ పథకానికి మంత్రి రవికుమార్ శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులను మంత్రి దగ్గర ఉండి స్థానికులు, మహిళలతో ప్రారంభించడం విశేషం. కార్యక్రమాలలో విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్ రావు, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, ఏవో వెంకటకృష్ణ, కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్, మాజీ సర్పంచులు పుట్టా దేవిసాంబశివరావు, ఏడుకొండలు, మండల టీడీపీ నేతలు మానం మురళీమోహన్‌దాస్, చాగంటి రాజేంద్రప్రసాద్, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, కోండ్రు వీరాంజనేయులు, నర్రా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్య కన్నా సభకే ప్రాధాన్యం

పొగాకు సాగులేని ప్రాంతాల నుంచి

భారీగా తరలింపునకు నేతల యత్నాలు

నేడు పొదిలిలో పొగాకు రైతులతో జగన్ ముఖాముఖి



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాక సందర్భంగా భారీగా ప్రజలను సమీకరించేందుకు వైసీపీ నాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. తద్వారా ప్రజల్లో పార్టీకి ముఖ్యంగా జగన్‌కు ఆదరణ తగ్గలేదన్న భావన కలిగించే ఉద్దేశంతో ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ నేతల ప్రయత్నాలను పరిశీలిస్తే జగన్ బుధవారం పొదిలి రాక వెనక పొగాకు రైతుల సమస్య పరిష్కారమా లేక బల నిరూపణ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారణాలు ఏమైనా ఈ ఏడాది దేశవ్యాప్తంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించటం లేదు. కొన్ని పంటల ఉత్పత్తులు అయితే కొనే నాధుడే కరువయ్యాడు. ఈ దశలో ఆయా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు కూడా చేపట్టాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా విషయానికి వస్తే ప్రధానమైన వాణిజ్య పంట పొగాకు అధికంగా సాగు అవుతుంది. ఒకవైపు దొర పొగాకు, బర్లీ పొగాకును రైతుల భారీగా పండించారు.

బర్లీ సమస్య ప్రభుత్వం స్పందన ఇలా...

బర్లీ సాగులో పర్చూరు నియోజకవర్గం అగ్రగామిగా ఉంది. మొత్తం నల్ల బర్లీ సాగులో 65శాతం సాగు అక్కడే జరుగుతుంది. నల్ల, తెల్లబర్లీని కొనే వారు కరువయ్యారు. ఈ సమస్యను తొలుత పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఆపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు జోక్యం చేసుకున్నారు. వివిధ పరిణామాల అనంతరం బర్లీ పొగాకు కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపింది. పర్చూరు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ బర్లీ పొగాకు రైతుల సమస్యలపై వైసీపీ గాని ఆ పార్టీ అధినేత జగన్ కాని ప్రభుత్వంపై ఒత్తిడి చేసిన దాఖలాలు లేవు.

నేగు జగన్ కార్యక్రమ తీరు తెన్ను

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ముఖ్య ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైసీపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమే. కానీ అందుకు జగన్ దొర పొగాకు అధికంగా పండే ప్రాంతాలను వదిలేసి పొదిలి ప్రాంతాన్ని ఎంచుకోవటమే చర్చనీయాంశమైంది. దీనికితోడు జగన్ రాక సందర్భంగా ప్రజలను భారీగా సమీకరించేందుకు వైసీపీ నాయకులు సర్వశక్తులొడ్డి ప్రయత్నించటం కూడా చర్చనీయాంశమైంది. అందునా దొర పొగాకు తక్కువగా పండే దర్శి, మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి జనసమీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ప్రాంతాల్లోనే ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నాయకులు భారీగా వాహనాలు ఏర్పాటు చేయటం విశేషం. మరోవైపు తూర్పు ప్రాంతంలో కూడా వైసీపీ నాయకులు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి అదేదో బలప్రదర్శన అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. దీంతో జగన్ రైతుల కోసమా.. బలప్రదర్శన కోసమా అనేది చర్చనీయాంశమైంది. పైగా ఆయన కూడా ఎప్పటిలాగే గంట సమయం మాత్రమే కేటాయించటం విశేషం.

జిల్లాలోనే అత్యధికం

ఇక దొర పొగాకు సాగు విషయానికి వస్తే ప్రకాశం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగు అవుతుందనేది జగమెరిగిన సత్యం. ఈ పంట సాగు కూడా అధికంగా కందుకూరు, కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు ఆ తర్వాత కనిగిరి, పొదిలి ప్రాంతాలతోపాటు ఇతర నియోజకవర్గాల్లో అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో సాగవుతుంది. గత ఏడాది అత్యధిక ధర లభించింది. మంచి లాభాలు వచ్చాయి. దీంతో రైతులు మరింత ఉత్సాహంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. దిగుబడి పెరగటంతో మార్కెట్‌లో సమస్య ఎదురైంది. అంతోఇంతో కొనుగోలులో సమస్యలు లేవు. గత ఏడాది కన్నా ధర తగ్గటమే ప్రధాన సమస్య. ఈ విషయంపై రాష్ట్రప్రభుత్వం కూడా స్పందించింది. ఒంగోలులో మంత్రులు స్వామి, రవికుమార్, రామనారాయణ రెడ్డి ఇతర టీడీపీ ఎమ్మెల్యేలు ఈ సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బోర్డు చైర్మన్, అధికారులు, వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకొని కేంద్ర పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడటంతో పాటు వ్యాపార సంస్థలు రైతులకు న్యాయం చేయకపోతే ఇబ్బందిపడతారని హెచ్చరికలు జారీ చేశారు. ఆ తర్వాత కొనుగోలులో వేగం పెరిగినప్పటికీ గత ఏడాది ధర మాత్రం రైతులకు లభించని మాట నిజం. బర్లీ పొగాకు కొనుగోలుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించిన రాష్ట్రప్రభుత్వం తదనంతర చర్యగా దొర పొగాకు సమస్యపై దృష్టిసారించింది.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న వేటపాలెం ఎడ్లజత





బండను లాగుతున్న ఎడ్ల జత, ప్రథమ బహుమతి రూ.70వేలు అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు సింగయ్య

సింగరాయకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఐదో రోజైన మంగళవారం ఆలయ సమీపంలో గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

పలు జిల్లాల నుంచి ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోటి శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్ల జత నిర్ణీత 20 నిమిషాల్లో 3300 అడుగుల దూరంలాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన గొటికె హెత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో 3,168 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలేనికి చెందిన ఎడ్లజత నిర్ణీత సమయంలో 3,144 అడుగుల దూరంలాగి తృతీయ స్థానం దక్కించుకుంది. బల్లికురవ గ్రామానికి చెందిర పావులూరి వీరస్వామిచౌదరికి చెందిన పీవీఎస్‌ఆర్ బుల్స్ 3100 దూరం లాగి చతుర్థస్థానాన్ని, ప్రకాశం జిల్లా అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు శివశంకర్ ఎడ్లజత నిర్ణీత 20 నిమిషాల్లో 2700 అడుగుల దూరంను లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్లజత యజమానులకు వరుసగా బహుమతులను టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య రూ.70వేలు, గంజిప్రసాద్ రూ. 50వేలు, బాపట్ల బ్రదర్స్ రూ. 40వేలు, చిమట మాధవ రూ.20వేలు అందజేశారు. నేడు రాష్ట్ర స్థాయి రాడాడి పోటీలను నిర్వహించనున్నారు.

చెరువులో పడి యువకుడు మృతి



వెంకటేష్ మృతదేహం

సంతనూతలపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు పెద్ద చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. చీమకుర్తికి చెందిన నేరెళ్ల వెంకటేష్ (25) సోమవారం మధ్యాహ్నం చీమకుర్తి నుంచి ఒంగోలుకు ఆటోలో బయలుదేరాడు. రాత్రి 10 దాటిన అతను ఇంటికి చేరుకోకపోవడంతో చుట్టుపక్కల వారిని, వేరే ఊళ్లలో బంధువులను కుటుంబసభ్యులు విచారించారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం స్థానికులు కొందరు పెద్దచెరువు వైపుగా వెళ్తుండగా మృతదేహం నీటిలో తేలియాడుతున్న విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చేరుకుని వెంకటేష్ మృతదేహంగా గుర్తించి కన్నీరుమున్నీరు అయ్యారు. పోలీసులు చెరువులో నుంచి మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మార్గం మధ్యలో సంతనూతలపాడు చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు దిగిఉంటాడని, ప్రమాదవశాత్తు నీటిలో పడి వెంకటేష్ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు తండ్రి పున్నారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో

122 మంది బదిలీ

డిప్యూటీ ఎంపీడీవోలు 16 మంది..

గ్రేడ్-1 నుంచి 4 వరకు 106 మందికి స్థానచలనం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న 122మందిని బదిలీ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తదనుగుణంగా ఈ బదిలీలను నిర్వహించారు. ఐదేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులు తొమ్మిది మంది ఉండగా రిక్వెస్టు కింద 71మంది, పరిపాలన సౌలభ్యం కోసం మరో 29మందిని మార్చారు. అందులో ఇతర జిల్లాలకు 13మందిని బదిలీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవోలు(ఈవోపీఆర్‌డీ) 16 మంది, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు 20మంది, గ్రేడ్ పంచాయతీ కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులు 45మంది, గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు 39మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో డిప్యూటీ ఎంపీడీవోలు ఎనిమిది మందిని, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్-3 కార్యదర్శులు ముగ్గురిని బాపట్ల, నెల్లూరు జిల్లాలకు పంపారు.

అవీఇవీ

గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలు



గాయపడిన సత్యనారాయణని వైద్యశాలకు తరలిస్తున్న బంధువులు

చినగంజాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన కడవకుదురు రైల్వే గేట్ సమీపంలో మంగళవారం చోటుచేసుకొంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... కడవకుదురు గ్రామానికి చెందిన తోటకూర నాగరాజు, కుమారులు సత్యనారాయణ, హరికిరణ్‌లు తమ మేనమామ గ్రామమైన వేమూరు మండలం పెరవలిపాలెం నుంచి గుడివాడ నాగేంద్రంతో కలిసి అతని ద్విచక్ర వాహనంపై కడవకుదురు గ్రామానికి వస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న వారు కడవకుదురు రైల్వేగేటు దాటిన తరువాత చీరాల వైపు వేగంగా వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేంద్రం, హరికిరణ్‌లకు గాయాలు కాగా, సత్యనారామణ కుడికాలికి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో గాయపడిన వారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారామణను మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ మణిపాల్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

325 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం



పాలవ్యాన్‌లో పట్టుబడిన రేషన్ బియ్యంతో ఎస్సై మహ్మద్ రఫీ

మేదరమెట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో పాలవ్యానులో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మేదరమెట్ల ఎస్సై షేక్ మహ్మద్ రఫీ పట్టుకున్నారు. సోమవారం రాత్రి నిర్దిష్ట సమాచారం మేరకు గుంటూరు వైపు నుంచి కృష్ణపట్నం వెళుతున్న బియ్యం లారీని ఎస్సై సిబ్బందితో కలసి పట్టుకున్నారు. తనిఖీ చేయగా ప్లాస్టిక్ బ్యాగుల్లో ఒక్కొక్కటి 30కేజీల బరువున్న 325 రేషన్ బస్తాలను గుర్తించారు. లారీడ్రైవర్ దేవరకొండ గోపీని విచారించగా చిలకలూరిపేటకు చెందిన కిషోర్‌కు చెందిన బియ్యంగా తెలిపినట్లు సమాచారం. ఆ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై మహ్మద్ రఫీ తెలిపారు.

అటవీభూములను ఆక్రమిస్తే చర్యలు

కొప్పెరపాడులో అటవీభూములను పరిశీలించిన బీట్ ఆఫీసర్



ఆక్రమణలోఉన్న అటవీ భూములను పరిశీలిస్తున్న బీట్ అఫీసర్ రమేష్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అటవీ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కూకట్లపల్లి ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె.రమేష్ హెచ్చరించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కొండపోరంబోకు భూమి ఆక్రమణ' శీర్షికన వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. కొప్పెరపాడు గ్రామ సమీపంలో ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ మాట్లాడుతూ, అటవీ భూములను కొందరు ఆక్రమించుకొని పంటలు సాగు చేస్తున్నారన్నారు. అలా చేయటం చట్ట రీత్యా నేరమని చెప్పారు. కొండ వద్దకు దారిని కూడా ఏర్పాటు చేశారని, వెంటనే దారిని తొలగించాలని తెలిపారు. ఈ పరిశీలనలో రెవెన్యూ గ్రామ వీఆర్వో గురవయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు ఆర్థికసాయం

అద్దంకిటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఇద్దరు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం రోటరీ కార్యాలయంలో దాత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చెన్నుపాటి రామాంజనేయులు సౌజన్యంతో ఇంటర్ చదువుతున్న తన్నీరు మణికంత, సయ్యద్ అమీర్ అహమ్మద్ కళాశాల ఫీజుగా ఒక్కొకరికి రూ.15 వేలు చొప్పున రూ.30 వేలను అందజేశారు. తాను పేదరికం నుంచి వచ్చానని, ఏటా విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు రామాంజనేయులు అన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళీసుధాకరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, సుబ్బారావు, రామా కోటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయలపల్లి, నర్సాయపాలెం గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ఫాంపాండ్లు, కంధకాలు, గోకుల షెడ్లను దిశ జాయింట్ డైరెక్టర్ ఉమేష్ కుమార్‌రామ్, రూరల్ డెవలప్‌మెంట్ అకౌంట్ ఆఫీసర్ జీఎస్ రావత్, ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాలలో గ్రామసభలను నిర్వహించి ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏడు వారాలుగా చేసిన పనులకు నగదు జమకాలేదని కూలీలు బృంద సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో శైలజ, పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు

చెన్నూరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ కేసులో బరకం వెంకటేశ్ అనే వ్యక్తికి కడప 7వ ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఎ.రమేశ్‌కుమార్ జీవితఖైదుతో పాటు రూ.లక్షా 50 వేలు జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు.. చెన్నూరు మండలంలోని ఓ గ్రామ సచివాలయం పరిధిలో వలంటీరుగా పనిచేస్తున్న మహిళకు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన బరకం వెంకటేశ్ పరిచయం అయ్యాడు. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. వెంకటేశ్ ఆ మహిళపై ప్రేమ ఉన్నట్లు నటించి పెళ్లి చేసుకుందామని నమ్మించి కడప నగరంలోని ఓ లాడ్జికి పిలిపించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తరువాత మహిళ పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో నిరాకరించడంతో పాటు దుర్భాషలాడాడు. దీనిపై 2021 జూన్ 20న బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు. అనంతరం విచారణను అప్పటి కడప రూరల్ సీఐ మహ్మద్ ఆలీకి అప్పగించారు. సీఐ దర్యాప్తు చేసి వెంకటేశ్‌ను అరెస్టు చేసి కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి ఎదుట విచారణకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ క్రిష్ణారెడ్డి సంబంధిత సాక్షులను సకాలంలో హాజరు పరిచారు. బాధితురాలి తరఫున ఎం.యాస్మిన్ వాదనలు వినిపించారు. ఈ మేరకు వెంకటేశ్ నేరం చేసినట్టుగా రుజువు కావడంతో అతడికి జీవిత ఖైదుతో పాటు రూ.1.50 లక్షలు జరిమానా విధిస్తూ మంగళవారం జడ్జి తీర్పు ఇచ్చారు.

అవీ..ఇవీ..

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో పోలేరమ్మ

హనుమోజిపాలెం (ఇంకొల్లు), జూన్ 10, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హనుమోజిపాలెంలో వేంచేసిన పోలేరమ్మ పోతురాజు స్వామివార్లకు మంగళవారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మూడో వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం, భరతనాట్యంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

మార్టూరు,జూన్10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని, చిన్న వయస్సులోనే వివాహాలు జరగడం ద్వారా కలిగే నష్టాలను అంగన వాడీ సూపర్ వైజరు టి.శిరీష వివరించారు. మంగళవారం మార్టూరులో నేతాజీనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన శిరీష మాట్లాడుతూ బాలికల తల్లిదండ్రులకు బాల్య వివాహాలు వలన ఏర్పడనున్న సమస్యలను వి వరించాలన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండిన తర్వాత వివాహం జరిపించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శారదాదేవి, ప్రమీలరాణి, ఇంకా అంగనవాడీ కార్యకర్తలు అరుణ, రాజ్యం, దయమ్మ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి

- ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య
- చీరాల్లో ఏపీ మార్క్‌ఫెడ్ గోదాము ప్రారంభం


పొగాకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : .పొగాకు బర్లీ రైతుల క్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ వెంకటమురళీ, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. చీరాల పరిధిలోని పేరాల్లో ఏపీ మార్క్ ఫెడ్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ గోదామును కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని కంపెనీల మాటలతో గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు రైతులు పొగాకు సాగుచేసి మోసపోయారన్నారు. ఈ నేపథ్యంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ కంపెనీను రంగంలోకి దింపినట్లు చెప్పారు. ఇప్పటికే పర్చూరు, చీరాల మండలాల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరో మూడు కేంద్రాలు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్లు చెప్పారు. రైతుల వద్ద 7.78 లక్షల క్వింటాళ్ల పొగాకు ఉండగా, మార్క్ ఫెడ్ 1.48 లక్షలు క్వింటాళ్ల కొనుగోళ్లు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈనెల 16 నుండి కొనుగోళ్లు విస్తృతం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జీఎం కరుణశ్రీ, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, తదతర అధికారులు, రైతులు ఉన్నారు.

వృద్ధులకు ప్రాణాయామంపై అవగాహన

మార్టూరు, జూన్10 (ఆంధ్రజ్యోతి): మార్టూరులోని అ మ్మ ఆశ్రమంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు ధ్యానం, ప్రాణాయామం, యోగాసనాలపై వైద్యాధికారి అంజమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతేగాకుండా వారిలో కొంతమందితో యోగాసనాలను వేయించారు. కార్యక్రమంలో యోగ ఇన్‌స్ట్రక్టర్ సౌజన్య,కాంపౌండర్ తనూజ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వారికి ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య

- టీడీపీ స్పోక్స్‌పర్సన్ మాదిగాని గురునాథం

పర్చూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) :అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని టీడీపీ స్పోక్స్‌పర్సన్ మాదిగాని గురునాథం అన్నారు. రాజకీయ మీడియా ముసుగులో వైసీపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే దీనికి బేషరతుగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం

అద్దంకిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఇరువురు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం రోటరీ కార్యాయలంలో దాత, విశ్రాంత ప్రధానోపధ్యాయులు చెన్నుపాటి రామాంజనేయులు సౌజన్యంతో ఇంటర్ మీడియట్ చదువుతున్న తన్నీరు మణికంఠ, సయ్యద్ అమీర్ అహమ్మద్ కళాశాల ఫీజుగా ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున రూ.30 వేలను విద్యార్థులకు అందజేశారు. తాను పేదరికం నుండి వచ్చానని, ఏటా విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తుంటానని రామాజంనేయులు అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆ కాంక్షించారు. దాత రామాంజనేయులును రోటరీ క్లబ్ సభ్యులు, కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళిసుధాకరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, సుబ్బారావు, రామాకోటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


బాధితకుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఇటీవల అగ్నిప్రమాదంలో మేదరమెట్లలోని పులివాసుకు సంబంధించిన పుస్తకాలు, ఫ్యాన్సీ దుకాణంలో అగ్నిప్రమాదం జరగ్గా, బాధిత కుటుంబాన్ని మంత్రి రవికుమార్ పరామర్శించారు. తన సొంత నిధులు రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. తిరిగి వ్యాపారంలో నిలదొక్కుకొని ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాసరావు, చావా రాజేష్, రవవరపు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు యంత్రపరికరాలు

అద్దంకి : ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తోందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని పార్వతీపురంలో పార్వతీ కిసాన్‌డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్‌కు 80 శాతం రాయితీతో డ్రోన్‌ను మంత్రి రవికుమార్ అందజేశారు. అద్దంకి మండలానికి మూడు డ్రోన్లు మంజూరు అయ్యాయన్నారు. ఆధునికి వ్యవసాయ యాంత్రీకరణతో సాగు సులభం అవుతుందన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు కోట శివయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న విద్యుత్ వెతలు

- నలభై ఏళ్లనాటి స్తంభాలు మార్పు
- కొత్త తీగలతో లైన్లు
- ఇప్పటికే 2500 స్తంభాలు 34 ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు


లైన్లు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

మేదరమెట్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఎప్పుడో 40 ఏళ్లకు పూర్వం నిర్మించిన విద్యుత్ లైన్లు కిందకు వేళాడుతూ తరచూ మరమ్మతులకు గురవుతూ ఉండేవి. కొద్దిగా వర్షం పడినా, కొద్దిగా గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. భవనాలకు దగ్గరగా వేళాడుతున్న తీగలతో బిక్కు బిక్కు మంటుండేవారు. అయితే కొరిశపాడు మండలంలోని విద్యుత్‌శాఖ అధికారులు ఒక్కసారిగా పునఃనిర్మాణ పనులు చేపట్టారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలో సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో మట్టిరోడ్లున్నప్పుడు అర్థశతాబ్దం క్రితం విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. ఆ తరువాత గ్రామాలలో భవనాల నిర్మాణం పెరగడం, వీటికితోడు సిమెంట్‌రోడ్లు రావడంతో విద్యుత్ స్తంభాల ఎత్తు తగ్గింది. దీనికి తోడు పాతలైన్లు కావడంతో కిందకు వేలాడుతూ ఉండేవి. ఇక గ్రామాలు కూడా విస్తరించడంతో గతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు సామర్థ్యం చాలక తరచూ ఫీజులు పోయేవి. దీంతో ఎంతో ఇబ్బందికి గురయ్యేవారు. ముఖ్యంగా గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు.

టీడీపీ అధికారంలోకి వచ్చాక అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో కొరిశపాడు మండలంలో కొత్త విద్యుత్ స్తంభాలు, లైన్లు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. మేజర్ పంచాయతీలైన మేదరమెట్ల, రావినూతల, పమిడిపాడు గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పాతవాటి స్థానంలో 1500 కొత్త స్తంభాలు, 19 పవర్ ట్రాన్ స్ఫార్మర్లు నిర్మించడంతో వేలాడుతున్న తీగలు, లోటల్టేజ్‌తో పాటు విద్యుత్ సమస్యలు తొలగిపోయాయని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొరిశపాడు, కుర్రవానిపాలెం, అనమనమూరు, దైవాలరావూరు, బొల్లవరప్పాడు, ప్రాసంగులపాడు, కాకానివారిపాలెం, రాచపూడి, అనుబ్రోలువారిపాలెం, బొడ్డు వానిపాలెం గ్రామాల్లో పాతస్తంభాల స్థానంలో 1000కి పైగా కొత్త స్తంభాలతోపాటు పాటు 15 ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం పూర్తిచేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో పడుతున్న ఇబ్బందులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముగింపు పలికారని, కొత్త నిర్మాణాల పట్ల కాలనీల వాసులు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

తిమ్మనపాలెం, ఎర్రబాలెం గ్రామాల్లో లైన్ల మార్పు పనులు జరుగుతున్నాయి. తమ్మవరం, పి.గుడిపాడు గ్రామాల్లో పనులు మొదలు కావలసి ఉందని విద్యుత్‌శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. మంగళవారం మేదరమెట్లలో పూర్తైన పనులను డీఈ దామోదర్, ఏఈ షైలా శ్రీనివాసరావు సిబ్బందితో కలసి పరిశీలించారు.

తరచూ కరెంట్ పోతుండేది

గతంలో తరచూ లోటల్టేజ్ సమస్యతో కరెంట్ పోతూ ఉండేది. ఎప్పుడో 40ఏళ్ల క్రితం వేసిన స్తంభాలు, తీగలు కిందకు వేళాడుతూ ఉండేవి. మంత్రి రవికుమార్ చొరవతోనే ఎత్తు స్థంభాలు కొత్త తీగలు వేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టారు. దీంతో లోటల్టేజ్ సమస్య పరిష్కారమైంది.

పందుల ఆశీర్వాదం

ఇనాం భూముల సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇనాం భూముల సమస్య పరిష్కారానికి సీసీఎల్‌ఏ (చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) కమిషనర్ జి.జయలక్ష్మితో మంగళవారం ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ బాపట్ల జిల్లా, పర్చూరు నియోజకవర్గంలో ఎనిమిది దశాబ్దాలుగా రైతులు సాగుచేసుకుంటున్న ఇనాం భూములకు పట్టాలులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా నియోజకవర్గంలోని మార్టూరు మండలం లక్కవరం, జంగమహేశ్వపురం, పర్చూరు మండలం ఏదుబాడు, చెన్నుంబొట్ల అగ్రహారం గ్రామాల్లో ఈ భూములు ఉన్నాయన్నారు. రైతులు 80 ఏళ్లుగా ఇనాం, ఎస్టేట్ భూములను సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. సన్న, చిన్నకారు రైతులు సాగుచేసుకుంటున్న ఈ భూములకు ఎలాంటి పట్టాలు కానీ పాసు పుస్తకాలు కానీ లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ల దృష్టికి తీసుకువెళ్లానని వివరిం చారు. ఇప్పటికే రెవెన్యూ మంత్రి కీలక ఆదేశాలు కూడా జారీ చేశారన్నారు. ప్రభుత్వ పరంగా అందించే ఎటువంటి సంక్షేమ పథకాలు, రాయితీ పథకాలు అందక తీవ్రఅవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే సమస్య పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమస్యను త్వరిత గతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి : ఎమ్మెల్యే


గోపాలకృష్ణయ్యకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, చీరాల - పేరాల ఉద్యమకారులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జ్ఞాపకాలు భద్రపరచడంలో ప్రత్యేక దృష్టిసారిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం నియోజకవర్గంలో ఘనంగా దుగ్గిరాల వర్థంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో ప్రముఖులు, వివిధ సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు దుగ్గిరాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అలాగే బహుముఖ ప్రజ్ఞశాలిగా వ్యవహరించి ప్రజలకు కల్పించిన ఆదరణను కొనియాడారు. అలాగే రామనగర్‌లో దుగ్గిరాల నివసించిన ప్రదేశంలో లైబ్రరీ ఏర్పాట్లుకు స్థలాన్ని గుర్తించి చదును చేయించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దుగ్గిరాల అభిమానులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి

చీరాల : ప్రతి ఇంటికి తాగు నీటి కొళాయిను అందించేందుకు అన్ని విధాలుగా కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. చీరాల మండల పరిధిలోని కొత్తపాలేనికి చెందిన దండు బాటలో జలజీవన్ మిషన్ ద్వారా జరుగుతు్న తాగునీటి పైపల్‌లైన్ పనులను పరిశీలించారు. పనులు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వేగవంతంగా జరగాలని సూచించారు. అలాగే పట్టణంలో ఎమ్మెల్యే, సినీ నటులు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

వేములపాటిని కలిసిన జనసేన నాయకులు


అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

చినగంజాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ను పర్చూరు నియోజకవర్గ పరిధిలోని జనసేన పార్టీ మండల అధ్యక్షులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని టిడ్కో కార్యాలయంలో ఆయనను కలిసి పర్చూరు నియోజకవర్గంలో జనసైనికులు ఎదురుకొంటున్న సమస్యలపై వినతిపత్రాన్ని జనసేన మండల నాయకులు అందజేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ చినగంజాం, మార్టూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల అధ్యక్షులు సందు శ్రీనివాసరావు, మందపాటి కిషోర్, సాగిరి శ్రీనివాసరావు, నారిశెట్టి ప్రవీణ్‌కుమార్, గణివిశెట్టి అయ్యప్ప, పలు మండలాల నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థినికి బంగారు పతకం

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల విద్యార్థినీ బిటెక్ పరీక్షల ఫలితాల్లో బంగారు పతకం సాధించినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన పరీక్షల్లో ఎస్‌కె ఫర్హాన ఉత్తమంగా రాణించి పతకం సాధించినట్లు తెలిపారు.

బండరాయిపడి కార్మికుడి మృతి

మార్టూరు, జూన్10 (ఆంధ్రజ్యోతి): మార్టూరు నుంచి నాగరాజుపల్లి వెళ్లే రోడ్డులోని ఓ గ్రానైట్ పరిశ్రమలో గ్రానైట్ బండరాయిని ఎక్స్‌కవేటర్ లేపే సమయంలో ఇనుప చైను తెగిపోవడంతో ఒడిషా రాష్ట్రానికి చెందిన ఒక కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. ఈ ఘటనలో మరో ఇద్దరు కార్మికులు కూడా గాయపడినట్లు తెలిసింది. అయితే ఈ ఘటన జరగగానే గ్రానైట్ పరిశ్రమను లీజుకు నడుపుతున్న వ్యక్తులు మృతిచెందిన కార్మికుని మృతదేహాన్ని, గాయపడిన ఇద్దరు వ్యక్తులను కారులో గుంటూరుకు తీసుకువెళ్లినట్లు తెలిసింది. గుంటూరులో చనిపోయిన కార్మికుని సొంతరాష్ట్రానికి మృతదేహాన్ని పంపించేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అంతేగాకుండా గాయపడిన ఇద్దరు కార్మికులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ గ్రానైట్ పరిశ్రమను మార్టూరులో సంపత్‌నగర్‌కు చెందిన ఇద్దరు యువకులు లీజుకు తీసుకున్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై పోలీసులను సంప్రదించగా తమ దృష్టికి రాలేదన్నారు. ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

రోడ్డుపై విరిగిన లారీ గేరు రాడ్డు


విరిగిన గేర్ రాడ్డు

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి-216లో లోడు లారీ గేరు రాడ్డు అకస్మాత్తుగా విరిగి రోడ్డుపై పడింది. ఈ ఘటన మంగళవారం రాత్రి మన్నవ అపార్ట్‌మెంట్ సమీపంలో చోటుచేసుకుంది. లోడుతో బాపట్ల వైపు నుండి ఒంగోలు వైపు వెళుతున్న లారీ గేరు రాడ్డు విరగడంతో పెద్ద శబ్దంతో లారీ అర్థాంతరంగా నిలిచింది. అయితే ఆ సమయంలో ఆ సమీపంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది, అయితే రాత్రంతా శ్రమించి లారీ డ్రైవర్, కండక్టర్ మరమ్మతుల అనంతరం లారీను కదిలించారు.

డ్రమ్ములు ఢీ కొని ఇరువురికి తీవ్ర గాయాలు

తోటవారిపాలెం(చీరాల), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన డ్రమ్ములు కారణంగా ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు ఈ ఘటన మంగళవారం రాత్రి జాతీయ రహదారి వెంబడి తోటవారి పాలెం వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం బాపట్ల మండలం పాండురంగాపురానికి చెందిన ఓ వ్యక్తి, మహిళ ద్విచక్ర వాహనంపై చీరాల వైపు నుంచి బాపట్ల వైపు వెళుతున్నారు. అంబేద్కర్ నగర్ వద్ద ఉంచిన డ్రమ్ములు కనపడక వేగంగా ఢీ కొట్టారు. ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 సహాయంతో బాపట్ల వైద్యశాలకు తరలించారు.

ఎస్ఎంవీటీ సూపర్ ఫాస్ట్‌లో పొగలు

- ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది
- గంటపాటు చీరాల సమీపంలో నిలిపివేత
- ప్రమాదం లేదని తేల్చడంతో కదిలిన రైలు


రైలు దిగి ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

చీరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎంవీటీ రైలులో పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బాపట్ల జిల్లా చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు గంటపాటు రైలు నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే.. ముజఫర్‌పూర్ నుంచి బెంగళూరు వెళుతున్న 15228 ఎస్ఎంవీటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈపూరుపాలెం రైలు గేటు సమీపంలోకి రాగానే గార్డు నుంచి ముందు వైపునకు సుమారు ఐదో బోగీ (ఎస్2) వద్ద పొగలు వచ్చాయి. దీంతో రైలులోని ప్రయాణికులు భయాందోళనతో చైన్ లాగారు. అయితే రైలు పేరాల గేటు సమీపానికి రాగానే నిలిచిపోయింది. ఆ సమయంలో చైన్ లాగిన వ్యక్తి రైలు దిగి వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే రైల్వే అధికారులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంతా పరిశీలించిన ఎటువంటి ప్రమాదం లేదని తేల్చడంతో రైలు బయలుదేరింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

దివ్యాంగులకు రాయితీపై రైల్వే పాసులు


దివ్యాంగులకు రైల్వేపాసులు అందజేస్తున్న ఏపీఎం, సీసీలు

చినగంజాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : చినగంజాం వెలుగు కార్యాలయంలో మండల దివ్యాంగుల సమాఖ్య కార్యదర్శి వడ్లమేడి వేణు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో నలుగురు దివ్యాంగులకు రాయితీపై రైల్వే పాసులు అందజేశారు. మండల దివ్యాంగుల సమాఖ్యలోని సభ్యులైన హనుమంతరావు, వెంకటరావు, అంకిరెడ్డి, వెంకటేశ్వర్లులకు రైలో ప్రయాణించేందుకు 75 శాతం రాయితీపై పాసులను అందజేసినట్లు ఏపీఎం జి.పెదసుబ్బారావు తెలిపారు. వారికి సెక్యూరిటీగా ఉన్న వ్యక్తికి కూడా 75 శాతం రాయితీ ఇస్తారన్నారు. మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మేంద్ర దివ్యాంగ గ్రూపునకు శ్రీనిధి ద్వారా లక్ష రూపాయిలు రుణం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల దివ్యాంగుల సమాఖ్య కోశాధికారి హనుమంతరావు, సభ్యులు వెంకటరావు, కే.సురేష్, చిట్టిబాబు, సీసీలు కే.వెంకటస్వామి, మాధవి, శ్రీలక్ష్మి, అకౌంటెంట్ పద్మావతిలు పాల్గొన్నారు.

కల్వర్ట్ నిర్మాణానికి భూమిపూజ


కల్వర్ట్‌కు భూమిపూజ చేస్తున్న నాయకులు

ఇంకొల్లు, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): ఇంకొల్లులోని బస్టాండు నుంచి కడవ కుదురురోడ్డుకు వెళ్లే మార్గంలో మురుగుకాల్వపై నూతన కల్వర్టు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న కల్వర్ట్ శిధిలావస్థకు చేరి కుంగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలో మండల పరిషత్ నిధులు రూ.9.5లక్షలు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. ఇటు వెళ్లే ట్రాఫిక్‌ను సినిమాహాల్ కూడలి మీదగా మళ్లించారు. భూమి పూజా కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి సుబ్బారెడ్డి, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, కరి శ్రీనివాసరావు, రఫీ, జరుగుల శ్రీను, మాబాషా, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొలిమేర సరిహద్దు పరిశీలన


పొలిమేర సరిహద్దును పరిశీలిస్తున్న చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

పంగులూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని చందలూరు - ఇంకొల్లు మండలంలోని కొణికి గ్రామాల మధ్య పొలిమేర సరిహద్దు ప్రాంతాన్ని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు మంగళవారం పరిశీలించారు. తమ సరిహద్దు ప్రాంతంలో కొణికి గ్రామానికి చెందిన కొందరు రైతులు మట్టితో కట్టలు వేశారని, దీని మూలంగా తమ పంటపొలాలోని వర్షపు నీరు బయటకు పోవడం లేదని చందలూరు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సంబంధిత రైతులకు స్థానిక తహసీల్దార్ సింగారావు కొద్దిరోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆర్డీవో చంద్రశేఖరనాయుడు సంబంధిత రైతులు, రెవెన్యూ అధికారులతో కలసి వివాదాస్పద ప్రాంతాన్ని పరిశీలించి సమస్యపై రైతులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి ఇరిగేషన్ అధికారులు చొరవ చూపాలని, ఎగువ పొలాలలో వర్షపు నీరు నిలువకుండా తగిన విధంగా తూములు ఏర్పాటు చేసి ఇరు గ్రామాల రైతులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, సర్వేయర్ శ్రీనివాసరావు, సురేష్, రైతులు పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తికి ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న నాయకులు

పంగులూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన నిదానపు కోటినాగులు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికాగా వైద్య చికిత్స నిమిత్తం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వం ద్వారా ఆరు లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయించారు. మంజూరైన రూ.6 లక్షలను ఎల్‌వోసీని స్థానిక టీడీపీ నాయకులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, గరిమిడి జగన్‌లు మంగళవారం కోటినాగులు తండ్రి అచ్యుతరావుకు అందజేశారు. ఒంగోలు కిమ్స్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న కోటినాగులుకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కిమ్స్ యాజమాన్యంతో మాట్లాడటంతో పాటు రూ.6 లక్షలు మంజూరు చేయించారు. వైద్యచికిత్సకు తోడ్పాటునందించిన మంత్రి రవికుమార్‌కు అచ్యుతరావు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

అద్దంకి, జూన్10(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్ లో మంగళవారం రా త్రి వాహనచోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు.